## సీతా సమేత అభయ రామచంద్ర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం

**వెల్దుర్తి, డిసెంబర్2 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని ఉప్పులింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత అభయ రామచంద్ర స్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా శ్రీశ్రీశ్రీ మాధవానంద స్వామి ఆశీస్సులతో శనివారం భక్తులు ఘనంగా హోమం నిర్వహించారు. పెంటయ్య శాస్త్రి, గరీశ్వర శర్మల మంత్రోచ్ఛరణ మధ్య వెంకటేశ్వర శర్మ, రామేశ్వర శర్మల దివ్య అనుగ్రహంతో సీతా సమేత అభయ రామచంద్ర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు శ్రీ విఘ్నేశ్వర పూజ, స్వస్తివచనం, అఖండ దీపారాధన, రుత్వికరణ, అవాయుత స్థాపన, పూర్ణాహుతి, రామంచద్ర స్వామివారికి అభిషేకం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పరిసర ప్రాంత ప్రజలు, మహిళలు, భక్తులు అశేషంగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంతమంతా భక్తులతో కోలాహలంగా మారింది.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

# నేడే అభ్యర్థుల భవితవ్యం

-ఎవరికి వారే గెలుపుపై ధీమా

-రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారనున్న గజ్వేల్ ఫలితాలు



**గజ్వేల్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):**
గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న సెంటిమెంట్ తారుమారు అవుతుందా... లేదా ఇక్కడ గెలిచిన అభ్యర్థి రాష్ట్రంలో అధికారం చేపడతారా మరికొన్ని గంటల్లోనే అభ్యర్థుల భవితవ్యం తేటతెల్లం కానుంది. నియోజకవర్గంలో ముగ్గురు హేమా హేమీలు పోటీలో దిగడంతో గజ్వేల్‌లో గెలుపుపై ఎవరికి వారే గెలుస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో రెండుసార్లు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఎమ్మెల్యేగా గెలిచి ముఖ్యమంత్రి పీఠం దక్కించుకున్న విషయం తెలిసిందే. గజ్వేల్‌లో టిఆర్ఎస్ పార్టీ నుండి కెసిఆర్ ఎమ్మెల్యేగా గెలిచి అధికారం చేజిక్కించుకోగా, బిజెపి అభ్యర్థి రాష్ట్రంలో మంచి పట్టున్న నేత ఈటల రాజేందర్ బరిలో నిలువడంతో పోటీ తీవ్రతరమైంది. ఒకవేళ బిజెపి అభ్యర్థి ఈటల రాజేందర్ గెలిస్తే రాష్ట్రంలో బిజెపికి సంపూర్ణ మెజార్టీ వచ్చే అవకాశాలు తక్కువగా ఉండడంతో గజ్వేల్ సెంటమెంట్ తారుమారు కావడం ఖాయమని పలువురు విశ్లేషకులు అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డి స్థానికంగా ఉంటూ ప్రజలతో మమేకమై ఉంటున్నాడని మొన్న జరిగిన ఎన్నికల్లో అతను గెలిచే అవకాశాలు లేకపోలేదు. నేడు జరగబోయే కౌంటింగ్‌లో ముగ్గురు అభ్యర్థులు గెలుస్తామనే ధీమాతో ఉన్నారు.

## కొండపోచమ్మ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

**జగదేవ్‌పూర్, డిసెంబర్ 2 (ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రంలో జగన్మాతగా విరాజిల్లుతున్న శ్రీ కొండపోచమ్మ అమ్మవారి 23వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ గర్నెపల్లి రజిత రమేష్, ఆలయ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు వేదపండితులచే గణపతి పూజ నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. తదనంతరం పుణ్యాహ వచనము, అఖండ దీప స్థాపన, ఋత్విక్వరణము, అగ్ని ప్రతిష్టాపన, మూలమంత్ర హవనం, అభిషేకం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రాతఃకాల పూజ, హవనం, మూలమంత్ర హోమం, స్థాపిత దేవత పూజ, సామూహిక కుంకుమార్చన, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని, కావున మహిళలు పెద్దఎత్తున సామూహిక కుంకుమార్చనలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందాలని తెలిపారు. అదేవిధంగా డిసెంబర్ 4 సోమవారం రోజున ఉదయం 11 గంటలకు శివపార్వతుల కళ్యాణోత్సవం, మధ్యాహ్నం 1 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారి సేవ ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే కార్యక్ర మానికి హాజరయ్యే భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుక ల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిల ఫోరం మండల అధ్యక్షులు మాసూరి కావ్య దర్గయ్య, ఆలయ డైరెక్టర్ కుమ్మరి కనకయ్య, సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, హరిబాబు, ఉప సర్పంచ్ సురేందర్‌రెడ్డి, వార్డు సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో గణపతిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

# నేడే తేలనున్న తీర్పు

-జిల్లాలో కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి
-మధ్యాహ్నం వరకు వెలబడనున్న ఫలితాలు




సిద్దిపేటలోని కౌటింగ్ కేంద్రం

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం సర్వం సిద్ధం చేశారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా గత నెల 30న నిర్వహించిన పోలింగ్ కౌటింగ్ కోసం సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని పొన్నాల శివారులోగల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లాలోని సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలకు చెందిన కౌటింగ్ కోసం ఏర్పాట్లు చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఒక లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లను వినియోగిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభిస్తారు. మొదట పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తూ వనున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. సిద్దిపేట నియోజకవర్గంలో 21 మంది అభ్యర్థులో బరిలో నిలువగా 2,33. 733 339 ఓట్లకు గానూ గురువారం జరిగిన పోలింగ్‌లో 1, 78,420 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపును పూర్తి చేయనున్నారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా మొత్తం 2, 42,177 ఓటర్లకు గానూ 205017 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 22 రౌండ్లలో ఓట్లను లెక్కించనున్నారు. గజ్వేల్‌లో 44 మంది అభ్యర్థులు పోటీ పడగా మొత్తం 2, 74, 654, ఓట్లకు గానూ 2, 31, 086 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. 23 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానుంది. దుబ్బాక నియోజకవర్గంలో 11 మంది అభ్యర్థులు బరిలో ఉండగా మొత్తం 1,98,100 మంది ఓటర్లు ఉండగా 1,73,366 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 19 రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా పోలింగ్ జరిగినందున తక్కువ సమయంలోనే లెక్కింపు పూర్తయి ఫలితాలు వెలువడనున్నాయి. మొత్తం మీద ఒక్కో రౌండు ఓట్ల లెక్కింపుకు సగటున కేవలం పది నిమిషాల్లోనే పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ లెక్కన మొత్తం రౌండ్ల లెక్కింపు రెండు, మూడు గంటల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. అదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నందున్న 11 గంటలలోపు ఫలితాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. వాస్తవానికి ఆలోపునే గెలుపోటములపై ఖచ్చితమైన అంచనా తేలిపోనుంది. ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఉండే ఏజెంట్లు ఎప్పటికప్పుడు ఓట్ల మొత్తాన్ని తెలుసుకుని లెక్కించుకుంటారు కాబట్టి, అధికారికంగా ప్రకటించక ముందే అనధికారికంగా వివరాలు వెల్లడయ్యే అవకాశాలు ఉన్నాయి. గతంలో ఎన్నుడూ లేని విధంగా కౌటింగ్ కేంద్రాలలో పటిష్టమైన బందో బస్తుతో పాటు తగు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగా కౌటింగ్ కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు అనుమతించేది లేదని ఏజెంట్లెవరూ కూడా లోనికి సెల్‌ఫోన్లు తేవొద్దని అధికారులు సూచించారు. ఎన్నికల అధికారులు జారీ చేసిన పాసులతో మాత్రమే సిబ్బంది, ఏజెంట్లను లోనికి అనుమతిస్తారని, పాసులు లేకుంటే లోనికి అనుమతించరన్నారు. ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూం తెరిచి ఇవిఎంలను కౌటింగ్ హాల్‌కు తరలించడం జరుగుతుందన్నారు. ఉదయం 7 గంటల్లోపు ఏజెంట్లు కౌటింగ్ కేంద్రానికి చేరుకోవాలని 8 గంటలకు కౌటింగ్ ప్రారంభమవుతుందన్నారు. కౌటింగ్‌కు అంతరాయం కలగకుండా ప్రతి ఒక్కరు సహకరించాలని అధికారులు కోరుతున్నారు. కాగా కౌటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కాగా గజ్వేల్‌లో 44 మంది పోటీలో ఉండడంతో మూడు ఇవిఎంలు, సిద్దిపేట 21 మంది, హుస్నాబాద్ 19 మంది బరిలో నిలవడంతో రెండు ఈవిఎంలను వినియోగించడంతో ఫలితాల ప్రకటనలో కొంత అలస్యం జరిగే అవకాశం ఉంది.



కౌటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

### సిద్దిపేటకు తరలిరానున్న నేతలు, కార్యకర్తలు

జిల్లాలోని సిద్దిపేట, దుబ్బాక, హుస్నాబాద్, గజ్వేల్ నియోజకవర్గాలకు చెందినకౌటింగ్ సిద్దిపేట పట్టణ శివారులోని హైదరాబాద్ రోడ్డులో గల ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతుండడంతో ఫలితాలను తెలుసుకోవడానికి ఆయా నియోజకవర్గాలకు చెందిన ప్రధాన రాజకీయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద యెత్తున తరలిరానున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్వతంత్రులుగా బరిలో నిలిచిన అభ్యర్థుల అనుచరులు సైతం రానున్నారు. దీంతో కౌటింగ్ పరిసరా ప్రాంతాల్లో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ పోలీసులు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

## కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

**మెదక్ అర్బన్, డిసెంబర్2 ప్రభాతవార్త:**
రెండు నియోజకవర్గాల పరిధిలో ప్రశాంత వాతావరణంలో సాఫీగా పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. హవేళిఘనపూర్ మండలంలోని స్థానిక వైపీఆర్ కళాశాలలో జరుగనున్న ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లను శానివారం ఆయన పరిశీలించారు. కౌంటింగ్ ప్రక్రియలో మెదక్ నియోజకవర్గంలో 274 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, 20 రౌండ్స్, నర్సాపూర్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు, 14 టేబుల్స్, ఈవీ ప్లస్ 2 పోస్టల్‌తో దాదాపు 22 రౌండ్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా సెగ్మెంట్ల నుండి ఓట్ల లెక్కింపు కేంద్రమైన వైపీఆర్ కళాశాలకు ఈవీఎంలను తరలించి జాగ్రత్తగా సరిచూసుకుని స్ట్రాంగ్ రూంలలోకి ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా క్రమపద్ధతిలో అమర్చామని అన్నారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సాయుధ బలగాలతో పహారా ఏర్పాటు చేశామన్నారు. ఎలాంటి అనుమానాలకు తావులేకుండా స్ట్రాంగ్ రూంలతో పాటు వాటి పరిసరాలను అనుక్షణం పరిశీలించేందుకు వీలుగా సీసీ కెమెరాలను అమర్చి మానిటర్ల ద్వారా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద శుక్రవారం సాయంత్రం 5 గంటల నుండి సోమవారం ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ నిషేదాజ్ఞలు అమలుల్లో ఉంటుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి ఇతరులెవరూ వెళ్లకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టామన్నారు. పై అన్ని ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఓట్ల లెక్కింపు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది రాకపోకలకు, అభ్యర్థులు, ఏజెంట్ల రాకపోకల కోసం వేరువేరు మార్గాలతో ఏర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించారు. త్రాగునీరు. విద్యుత్ సరఫరా, కౌంటింగ్ టేబుల్స్, ఇతర అన్ని ఏర్పాట్లను నిశితంగా పరిశీంచారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మెదక్ ఆర్‌వో రాజేశ్వర్, ఎన్నికల అధికారులు, ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ముల మృతి

**పాపన్నపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో ఇరువురు అన్నదమ్ములు మృతి చెందిన సంఘటన పాపన్నపేట మండల శివారులోని బారాకనాల్ వద్ద శనివారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. టేక్మాల్ మండల పరిధి అసన్మహమద్‌పల్లి గ్రామానికి చెందిన కుస్నోత్ చిన్య (45), దేవ్య (42) ద్విచక్రవాహనంపై పాపన్నపేట నుండి మెదక్ వైపు వరిధాన్యం విత్తనాలు కొనుగోలు చేసేందుకు వెళుతుండగా, పాపన్నపేట శివారులోని బారాకనాల్ (బ్రిడ్జి) వద్దకు రాగానే... ఎదురుగా వస్తున్న లారీ దిచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో ఇరువురు అన్నదమ్ములు రోడ్డుపై పడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. దీంతో స్థానికులు వెంటనే పాపన్నపేట పోలీసులకు సమాచారం అందివ్వడంతో పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాల పై పడి రోదించడంతో అక్కడ ఉన్న ప్రయాణికులు కంటతడి పెట్టుకున్నారు. పాపన్నపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ లారీని వదిలి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఇద్దరి అన్నదమ్ముల మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేడు రిజల్ట్ డే..

-గట్టి బందోబస్తుతో కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి -లెక్కలు వేసుకుంటున్న పార్టీలు





కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్ల దృశ్యం

**సంగారెడ్డి బ్యూరో, డిసెంబర్2 ప్రభాతవార్త:**
సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నవంబర్ 30న ఎన్నికల ప్రక్రియ పూర్తయింది. అందులో భాగంగా నేడు ఓట్ల లెక్కింపు జరుగనుంది. సంగారెడ్డి, మెదక్ జిల్లాలలోని అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ స్టేషన్లలోని ఈవీఎంలను గట్టి బందోబస్తు నడుమ భద్రపరిచారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు హవేళిఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో నిర్వహించనున్నారు. అదేవిధంగా సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, పటాన్చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపును పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించనున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్‌ల నేతృత్వంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

### కౌంటింగ్ ఇలా కొనసాగుతుంది...

మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు హవేళిఘనపూర్‌లోని వైపీఆర్ కళాశాలలో నిర్వహించనున్నారు. మెదక్ నియోజకవర్గంలోని 274 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 14 టేబుల్స్, 20 రౌండ్లలో లెక్కించనున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,16, 748 ఓట్లు ఉండగా 1,84,920 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 20 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. కౌంటింగ్ నిర్వహణలో ఒక్కో టేబుల్‌కు గాను ఒక సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, అసిస్టెంట్ ముగ్గురు అధికారులు పాల్గొననున్నారు. అదేవిధంగా నర్సాపూర్ నియోజకవర్గంలోని 305 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 14 టేబుల్స్, 22 రౌండ్లలో లెక్కించనున్నారు. ఈ నియోజకవర్గంలో మొత్తం 2,23,593 ఓట్లు ఉండగా 1,96,992 ఓట్లు పోలయ్యాయి. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 22 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి నియోజకవర్గంలోని 281 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 16 టేబుల్స్, 18 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 18 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. పటాన్‌చెరు నియోజకవర్గంలో 405 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 18 టేబుల్స్, 23 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 23 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. ఆందోల్ నియోజకవర్గంలోని 313 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 18 టేబుల్స్, 18 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 18 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 296 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 18 టేబుల్స్, 17 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 17 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది. జహీరాబాద్ నియోజకవర్గంలోని 314 పోలింగ్ స్టేషన్లలోని ఓట్ల లెక్కింపుకు గాను 18 టేబుల్స్, 18 రౌండ్లలో లెక్కించనున్నారు. ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న కౌంటింగ్ ప్రక్రియ 18 రౌండ్లుగా దాదాపుగా మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనుంది.




సాయుధ బలగాల పహారా

### తేలనున్న అభ్యర్థుల భవితవ్యం...

ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నాయకులు నానారకాల అవస్థలు పడ్డారు. విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ 28న ప్రచార కార్యక్రమం ముగిసి పోవడంతో పోల్ మేనేజ్‌మెంట్ పేరుతో విస్తృతంగా మద్యం, డబ్బు పంపిణీ చేసి తమకు అవకాశం కల్పించాలని ఓటర్ల చుట్టూ ప్రదిక్షణలు చేశారు. 30న పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో గత రెండు రోజులుగా పోలింగ్ సరళిపై ఆరాలు తీస్తూ తమ భవిష్యత్తుపై చర్చలు జరుపుతున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలతో కొంత మంది నేతలు ఆనందం వ్యక్తం చేస్తూ మెజారిటీ లెక్కలు వేసుకుంటుంటే మరికొందరు ఓటరు ప్రత్యక్ష తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. దాదాపు అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలతో పాటు ఇతరు పోటీలో ఉన్నప్పటికి ప్రధానంగా అధికార బీఆర్ఎస్ పార్టీ, కాంగ్రెస్ మధ్యనే హోరాహోరి పోటీ నెలకొన్నట్లు తెలుస్తుంది. రెండు జిల్లాలోని ఏడు సెగ్మెంట్లల్లో అధికార బీఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఆరు సెగ్మెంట్లను గెలుచుకోగా కాంగ్రెస్ ఓట సీటుకే పరిమితమైంది. ఈ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని అధికార పార్టీ, పట్టు సాధించాలని కాంగ్రెస్ పార్టీలు ముందు నుంచి తీవ్ర ప్రయత్నాలు చేశారు. చివరగా ఓటర్లను మనసు గెలుచుకొని గెలిచే అభ్యర్థులెవరో, ఓడే అభ్యర్థులెవరో మరికొన్ని గంటల్లోనే తేలనుంది.



కౌంటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

## మంత్రి హరీష్‌రావు మెజార్టీపై పార్టీ శ్రేణుల్లో-నరాలు తెగే ఉత్కంఠ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
శాసన సభ ఎన్నికల ఫలితాలు నేడు తేలనుండడంతో సిద్దిపేట నియోజకవర్గంలోని బిఆర్ఎస్ శ్రేణుల్లో మంత్రి హరీష్‌రావు మెజార్టీపైనే టెన్షన్, టెన్షన్‌లో ఉన్నారు. కౌటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది బిఆర్ఎస్ శ్రేణుల్లో మెజార్టీపై నరాలు తెగే ఉత్కంఠత నెలకొందని చెప్పక తప్పదు. సిద్దిపేటలో వార్ మాత్రం వన్ సైడే జరిగినట్లు చర్చ సాగుతుంది. ఈ సారి ఏది ఏమైనా తమ నాయకుడికి లక్ష 50 వేల మెజార్టీ అందించి తీరాలన్న సంకల్పంతో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచార బాధ్యతలను తమ తమ భుజస్కందాలపై వేసుకొని పోలింగ్ చివరి సమయం వరకు ఎంతగానో శ్రమించారు. మంత్రి హరీష్‌రావు ఇతర జిల్లాలలో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారానికి వెళ్ళడంతో ఇక్కడి పార్టీ శ్రేణులు మాత్రం లక్ష 50 మెజార్టీయే లక్ష్యంగా ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగించారు. 2010లో జరిగిన ఉప ఎన్నికల్లో హరీష్‌రావుకు 95 వేల పై చిలుకు మెజార్టీ రాగా 2014లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 93 వేల పై చిలుకు మెజార్టీ వచ్చిన విషయం తెలిసిందే. 2018 ముందస్తు ఎన్నికల్లో మంత్రి హరీష్‌రావుకు లక్ష 18 వేల 699 మెజార్టీ సాధించారు. ఈసారి పార్టీ శ్రేణులు లక్ష 50 వేల మెజార్టీ సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. కౌటింగ్‌కు సమయం దగ్గర పడుతున్న కొద్ది పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠత మరింత పెరుగు తుంది. గతంలో కంటే ఎక్కువగా మెజార్టీ సాధించి దేశానికి, రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తామని పార్టీ శ్రేణులు మాత్రం ఘంట పథంగా చెబుతున్నారు.

### దుబ్బాక, హుస్నాబాద్‌లో గెలుపు ఎవరిదోనని సర్వత్రా చర్చ

దుబ్బాక, హుస్నాబాద్ నియోజకవర్గాలలో హోరా హోరీగా సాగిన పోరులో గెలుపు ఎవరిని వరిస్తుందోన్న చర్చ జోరుగా సాగుతుంది. జిల్లాలోని దుబ్బాక నియోజకవర్గంలో త్రిముఖ పోటీ సాగింది. బిఆర్ఎస్ నుంచి ప్రభాకర్‌రెడ్డి, బిజెపి తాజా మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, కాంగ్రెస్ నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిలు బరిలోకి దిగారు. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల మధ్య ప్రచారం హోరెత్తింది. దుబ్బాకలో సాగిన త్రిముఖ పోటీలో గెలుపు ఎవరిదన్నది చెప్పకలేకపోతున్నారు. ఎవరు గెలిచిన కొద్ది మెజార్టీ తోనే బయటపడుతారన్న చర్చ జోరుగా సాగుతుంది. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ అభ్యర్థి వొడితల సతీష్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి పొన్నాం ప్రభాకర్‌ల మధ్య హోరా హోరీ పోరు సాగింది. ద్విముఖ పోటీలో ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో పసిగట్టం కష్టంగా మారింది. గజ్వేల్ సిఎం కెసిఆర్‌పై బిజెపి అభ్యర్థిగా ఈటెల రాజేందర్ బరిలోకి దిగడంతో ఇక్కడ కూడా పోరు హోరా హోరిగా సాగింది. రాష్ట్ర ప్రజల చూపు గజ్వేల్‌పైనే ఉంది.

-దుబ్బాక, హుస్నాబాద్‌లో గెలుపు ఎవరిదోనని సర్వత్రా చర్చ
-సిద్దిపేటలో వార్ వన్ సై డే
-రాష్ట్రం చూపు గజ్వేల్ వైపే


## కొర్రెముల బాలాజీనగర్‌లో సీసీ రోడ్డు ఏర్పాటు చేయండి

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 2, ప్రభాత వార్త:** ఘట్‌కేసర్ మండలంలోని కొర్రెముల గ్రామ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్లు లేకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొర్రెముల పంచాయతీ పరిధిలోని బాలాజీ నగర్ ఫేజ్ 1, ఫేజ్ 2 కాలనీలలో పలు చోట్ల సీసీ రోడ్లు లేకపోవడంతో రోడ్లపై దుమ్మురేగుతోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలు వెలుస్తున్న ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో పంచాయతీ పాలకవర్గం విఫలం అవుతుంది. స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామ సమస్యలను పట్టించుకోకపోవడంతో కాలనీల్లో అభివృద్ధి కుంటుపడింది. ఓ వైపు రోడ్లు అభివృద్ధి చెందకపోవడం, భూగర్భడ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైననే మురుగునీరు ప్రవహిస్తుంది. మరో వైపు గ్రామంలో నూతనంగా వెలుస్తున్న కాలనీలకు అనుగుణంగా రోడ్లు, వీధి లైట్లు, భూగర్భడ్రైనేజీ ఏర్పాటు చేయకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై పలుమార్లు గ్రామ సభలో కాలనీవాసులు ఫిర్యాదు చేసిన పంచాయతీ పాలకవర్గం పట్టించుకోవడం లేదని కాలనీ ప్రజలు తెలిపారు. ఇకనైనా పంచాయతీ పాలకవర్గం స్పందించి కాలనీల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.


కొర్రెముల పంచాయతీ బాలాజీనగర్ కాలనీలో సీసీ రోడ్డుకు అభివృద్ధికి నోచుకోని మట్టి రోడ్డు దృశ్యం

## ఘనంగా అయ్యప్ప మహాపడి పూజా మహోత్సవం

**కొందుర్గు, డిసెంబర్ 2, (ప్రభాతవార్త) :** మహాపడి పూజా మహోత్సవం సందర్భంగా మండల కేంద్రం లో అయ్యప్ప నామస్మరణతో మారుమ్రోగింది. ఆదివారం నాడు స్థానిక అయ్యప్ప కమ్యూనికేషన్ యాజమాని గణేష్ ఇంటి ఆవరణలో అయ్యప్ప మహాపడిపూజ భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగింది. అయ్యప్ప గురు స్వామి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహాపడి పూజకు చుట్టుపక్కల మం డలాలైన చౌదరిగూడెం,, పూడురు, కుల్కచర్ల, చౌడాపూర్, ఫరూఖ్‌నగర్‌లతో పాటు పాలమూరు జిల్లా లోని నవాబ్‌పేట, జడ్చర్ల, బాలానగర్ మండలాలకు చెందిన అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న స్వాములు, భక్తులు



మేడ్చల్ జిల్లాలో ఎన్నికల కౌంటింగ్ నిర్వాహణ కోసం ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించిన జిల్లా ఎన్నికల పరిశీలకులు,జిల్లా కలెక్టర్ నిర్వహించిన దృశ్యం

## కౌంటింగ్ కోసం ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది ఏర్పాటు : కల్టెకర్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 2, ప్రభాతవార్త**

ఎన్నికల కౌంటింగ్ కోసం సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాకు సంబంధించి ఎన్నికల నిబంధనల ప్రకారం కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు ఎస్‌కె జైన్, అమన్‌మిట్టల్, కౌంటింగ్ ప్రత్యేక అబ్జర్వర్లు, కూకట్‌పల్లికి హిమన్షు వర్మ, ఉప్పల్‌కు ధశరథ్ దెబ్బర్మ, జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 2439 పోలింగ్ కేంద్రాలకు 508 కౌంటింగ్ సిబ్బందిని ఎంపిక చేశామన్నారు. కౌంటింగ్ పర్యవేక్షకులు 161మంది, కౌంటింగ్ అసిస్టెంట్స్ 177మంది, మైక్రో అబ్జర్వర్లు 170మంది ఉన్నారని అన్నారు. దీనిలో వారితో పాటు జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ ఆగస్త్య, డిఆర్‌ఓ హరిప్రియ, జిల్లా ఎన్నికల సాదారణ పరిశీలకులతో పాటు రిటర్నింగ్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## తాండూరు లెజెండ్ ఎవరో..?

### నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
### ఉత్కంఠతతో ఎదురు చూస్తున్న ప్రజలు

**తాండూరు, డిసెంబరు 2, ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్ని కలు ప్రశాంతంగా ముగిసిపోయినా అభ్యర్థుల గెలుపోట ములపై ఉత్కంఠత నెలకొంది. తాండూరు " లెజెండ్ " ఎవరో అంటూ ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నా రు. నేడు అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఫలితాల వెల్లడికి ఇంకా కొన్ని గంటల వ్యవధి మాత్రమే ఉండటంతో అభ్యర్థుల్లో గుబులు మొదలైంది. విజయం ఎవరిని వరిస్తుందోనన్న భయం వెంటాడుతుంది. ప్రధాన పార్టీ ల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. తాండూరు నియోజకవర్గంలో రెండు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య ఉత్కంఠభరితంగా సాగిన సరవత్తర పోరులో ఆయా పార్టీల నేతలు ఓటింగ్ సరళిని అంచనా వేస్తూ గెలుపుపై ధీమాలో ఉన్నారు. విజయం తమదంటే... తమదే అంటూ నేతలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలు మాత్రం పోటాపోటీ సమరంలో గట్టెక్కేదెవరంటూ ఫలితం కోసం ఉత్కంఠతతో ఎదురు చూస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి బుయ్యని మనోహార్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి పైలట్ రోహిత్‌రెడ్డిల మధ్య గట్టి పోటీ ఉండగా.. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ హావా కొనసా గుతుందని ఎగ్జిట్ పోల్స్ తేలడంతో తాండూరులో కూడా కాం గ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తాడని ఆ పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. అయితే, గతంతో పోలిస్తే ఈ సారి ఓట్లు పెరగటంతో పాటు ఓటింగ్ శాతం తగ్గడంపై అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తుంది. గెలుపు ఎవరిని వరిస్తుందో అభ్యర్థులకు కూడ అంతుచిక్కడం లేదు. ఏది ఏమైనా కొన్ని గంటల వ్యవధిలోనే అభ్యర్థుల భవితవ్యం బయటపడనుంది. అంత వరకు వేచి చూడాల్సిందే.

## ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి

**ఆదిభట్ల డిసెంబరు2,ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో నవంబరు 30న జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఈవీఎం మిషన్లు ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళపల్లి గ్రామంలో గల సవిఆర్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద ఒక డిసిపి స్థాయి అధికారి మరియు ఇద్దరు సిఐలు నలుగురు ఎస్ఐలతో ప్రహార కొనసాగుతుంది. డిసెంబరు మూడో తేది ఆదివారం ఓట్ల లెక్కింపునకు అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.సివిఆర్ కాలేజీలో జరుగుతున్న ఈ ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఇబ్రహీం పట్నం మరియు కల్వకుర్తి మరియు మహేశ్వరం నియోజకవర్గంలోని ఓట్లు లెక్కించబడును కావున అధిక సంఖ్యలో కార్యకర్తలు మరియు ప్రజలు వచ్చే అవకాశం ఉన్నందున పోలీసు అధికారులు భద్రత సిబ్బందిని పెంచి ఓట్ల లెక్కింపు కేంద్రంవద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలో 2018 ఎన్నికలతో పోల్చుకుంటే ఈ సారి 48068 ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి.అయితే ఎన్నికల్లో పోలింగ్ పెరగడంతో ఫలితం ఏ విధంగా ఉంటుందో అని అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది.

## కొంగరకలాన్‌లో రోడ్డు ప్రమాదం

**ఆదిభట్ల డిసెంబరు2,ప్రభాతవార్త :** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో మంగళపల్లి,కొంగరకలాన్ మధ్యలో రోడ్డు ప్రమాదం జరిగి ఒక వ్యక్తికి తీవ్రంగా గాయాలయ్యాయి.ఈ విషయంపై సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ...శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ చదువుతున్న బానోతు దుర్గాప్రసాద్ (17) తన ద్విచక్ర వాహనంపై మంగళపల్లి నుంచి కొంగరకలాన్ వైపు ప్రయాణిస్తుండగా వెనుక నుంచి ఒక టాటా ఏస్ డ్రైవర్ ఓవర్టేక్ చేస్తుండగా కుడి వైపు ఉన్న దుర్గాప్రసాద్ బైక్ తగిలింది. దాంతో అక్కడికక్కడ కింద పడి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం దుర్గాప్రసాద్ కోమాలోకి వెళ్లాడు ఆటోడ్రైవర్‌పై ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.

## నేడే ఎన్నికల రిజల్ట్స్.. పార్టీలు ఎదురుచూపులు

**కోట్‌పల్లి, డిసెంబరు 2, ప్రభాతవార్త;** సాధారణ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 30 న జరిగాయి. గత మూడు రోజుల నుంచి ఎప్పుడు ఎప్పుడా.. అని రిజల్ట్స్ కోసం ఇరువర్గల పార్టీ నాయకులు ఎదురు చూస్తున్నారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ఎన్నికల రిజల్ట్స్ వస్తుండటంతో గ్రామాలల్లో ఉన్న ఇరూ ర్గుల పార్టీ నాయ కులు సైతం నువ్వానేనా అనే దోరణిలో ఉన్నారు. మండలంలో కొంత మంది నాయ కులు కారు వస్తాది. అని కొందరు మరి కోందరు చేతి గుర్తు వస్తాది అని మరికొందరు నాయకులు అనుకుటుంన్నారు. ఏదేమైనా నేడు 8, గంటలకు రిజల్ట్స్ ఎన్నికల ఫలితాలు తేలిపోనుంది.

# నేడే ప్రజా తీర్పు

### అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్
### అభ్యర్థుల భవితవ్యం ఈవిఎంలల్లో నిక్షిప్తం
### మధ్యాహ్నానికి ఫలితాల సరళిపై స్పష్టత

**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ నవంబర్ 30న పూర్తయ్యింది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల భవితవ్యం ఈవిఎంలల్లో నిక్షిప్తంగా ఉంది. ఇక పోటీలో ఉన్న అభ్యర్థుల్లో నెల కొన్న టెన్షన్‌కు నేటితో తెరపడనుంది. ఓటరు దేవుళ్ల తీర్పుపై కౌంట్‌డౌన్ ప్రారంభయయ్యింది. ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ మరి కొద్ది గంటల్లో వీడనుంది. ఆదివారం ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. నేడు మధ్యాహ్నానికి ఫలితాల సరళిపై స్పష్టత రానుంది. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకూర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవిఎంలను భద్రపరిచారు. ఈవీఎంలు భద్రపరిచిన సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకూర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసారు

**కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి...**

ఎన్నికల ప్రక్రియ పూర్తియింది. ఓటర్లు అభ్యర్థుల భవితవ్యాన్ని ఈవిఎంలల్లో నిక్షిప్తం చేసారు. నేడు 8:00 గంటల నుండి కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించనున్నారు. తర్వత 8:30గంటలకు ఈవీఎంలను కౌంట్ చేయనున్నారు. ఇబ్రహీంపట్నం మండల మంగల్‌పల్లి గ్రామ సమీపంలోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసారు. సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కల్వకూర్తి అసెంబ్లీ సెగ్మెంట్ల ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేసారు. స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసుల భారీ భద్రత ఏర్పాట్లను చేసారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సక్షన్ అమలులో ఉంటుంది. ఈ క్రమంలో అధికారులు ఓట్ల లెక్కింపుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

**అభ్యర్థుల్లో టెన్షన్..టెన్షన్...**

పోటీలో ఉన్న అభ్యర్థుల్లో టెన్షన్...టెన్షన్‌కు నేటితో తెరపడనుంది. నోటిఫికేషన్ వెలువడినప్పటి నుండి సభలు, రోడ్ షోలతో ఓట్లను ప్రసన్న చేసుకోవడంలో


ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాచకొండ సిపి డిఎస్ చౌహాన్

అభ్యర్థులు ఫుల్ బిజీగా ఉన్నారు. ఓటింగ్ పూర్తి కావడంతో అభ్యర్థులు కాస్త రిలాక్స్ అయినా ఓపక్క గెలుపోటములపై టెన్షన్..టెన్షన్‌గా ఉన్నారు. తమకు ఏయే బూతులో ఏవిధంగా ఓట్లు పడ్డాయో అంచనా వేసుకుంటున్నారు. నేడు వచ్చే ఫలితాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉంటాయనే విశ్వాసంతో ఉన్నారు. తాము గెలిస్తే మంత్రి పధవి తమదే నంటూ పలువురు అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

**మంత్రి పదవిపై ఆశలు...**

రంగారెడ్డి జిల్లాలో పలువురు అభ్యర్థులు మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. తమ పార్టీ అధికారం లోకి వస్తే ఈ సారి తప్పకుండ మంత్రి పదవి తమకే దక్కుతుందని విశ్వాసంతో ఉన్నారు. ఇబ్రహీంపట్నం బిఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మూడు సార్లు గెలిచి నాల్గవ సారి గెలుపు కోసం ఎదిరి చూస్తున్నారు. ఇక కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని.. తాను అధిక మెజార్టీతో విజయం సాధించి రంగారెడ్డి జిల్లా నుంచి తనకే మంత్రి పదవి దక్కుతుందని ఆశలో ఉన్నారు. ఇక ప్రజాతీర్పు ఎటువైపోనని వేచి చూడాలి.

**ఇ.పట్నం అసెంబ్లీలో 74.82శాతం పోలింగ్ నమోదు**

ఇబ్రహీంపట్నం అసెంబ్లీలో గతంలో కంటే పోలింగ్ శాతం తగ్గింది. అసెంబ్లీలో 74.82శాతం పోలింగ్ నమోదు అయ్యింది. 2018 ఎన్నికల్లో 76.38 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఈ ఎన్నికల్లో రెండు శాతం పోలింగ్ తగ్గింది. మొత్తం 327583 ఓటర్లు ఉన్నారు. 24510 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ ఓట్లను 14 ఈవిఎం టేబుల్లను, 6 పోస్టల్ బ్యాలెట్ టెబుల్స్‌లో లెక్కించనున్నారు. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ సెగ్మెంట్లో మొత్తం 343 బూతులు ఉండగా ఒక్కో టెబుల్‌కు 24 నుండి 25 బూతుల ఓట్లను లెక్కించనున్నారు. 500ల పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ఒక టెబుల్‌ను కేటాయించారు. అందుకు సంబంధించి ఏర్పాట్లును ఎన్నికల అధికారులు సిద్ధం చేసారు.

**ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సిపి డి.ఎస్ చౌహాన్**

ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లి పరిధిలోని సివిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినఓట్ల లెక్కింపు కేంద్రాన్ని రాచకొండ సిపి డి.ఎస్ చౌహాన్ పరిశీలించారు. నేడు జరిగే ఓట్ల లెక్కిం పునకు సంబంధించి పోలీసులు అధికారులకు పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు జరిగే ప్రాంతంలో 144 సక్షన్ అమలు లో ఉంటుందని...100మీటర్ల దూరంలో ఉండాలని చెప్పారు. ఆ ప్రాంతంలో ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండ భారీ భద్రత ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. పోలీసులు నిర్లక్ష్యం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.

**ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు**

| మండలం | మొత్తం ఓట్లు | పోలైన ఓట్లు |
|---|---|---|
| ఇబ్రహీంపట్నం | 72065 | 56578 |
| యాచారం | 47948 | 38498 |
| మంచాల | 40118 | 33997 |
| అబ్దుల్లాపూర్మెట్ | 167452 | 116041 |
| మొత్తం | 327543 | 245105 (74.82 శాతం) |


మేడ్చల్ జిల్లాలోని కీసర మండలం బోగారంలోని హోలీమేరి కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్, ఎన్నికల పరిశీలకులు, అధికారులు

# నేడు ఓట్ల లెక్కింపు

### ఏర్పాట్లను పరిశీలించిన మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, డిసెంబరు 2, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8గంటల నుంచి ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి మేడ్చల్ జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. జిల్లా పరిధిలోని కీసర మండలంలోని బోగారంలో ఉన్న హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాలలో మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగనుంది. శనివారం మేడ్చల్ జిల్లా కీసర మండలం బోగారంలోని హోలీమేరి ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలను, స్ట్రాంగ్‌రూమ్‌లను, కౌంటింగ్ హాల్స్‌ను మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ సందర్శించి పరిశీలించారు. జిల్లాలో 3న ఆదివారం ఎన్నికల కౌంటింగ్ నిర్వహిస్తున్నందున ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగ కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు 2,439 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 105రౌండ్స్ కోసం కౌంటింగ్ కోసం 116టేబుల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి టేబుల్‌కు మైక్రో అబ్జర్వర్, కౌంటింగ్ సూపర్‌వైజర్‌లు, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్లు, అదే విధంగ ఏజెంట్లతో పాటు రెవెన్యూ సిబ్బంది ఉంటారని ఆయన తెలిపారు. కౌంటింగ్ రోజున నిఘా నీడలో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మేడ్చల్ నియోజకవర్గంలో 584పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు, 21రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 28 ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్స్ కోసం 4టేబుల్స్ ఏర్పాటు చేశామన్నా రు. మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో 429పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు 21రౌండ్స్, టేబుల్స్ 20 ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్స్ కోసం 2టేబుల్స్ ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. కుత్బుల్లాపూర్ నియోజవర్గంలో 590పోలింగ్‌కేంద్రా లు ఉండగ, 21రౌండ్స్, 28టేబుల్స్ ఏర్పాటు చేశామని, పోస్టల్ బ్యాలెట్ కోసం 2టేబుల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో 418పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు, 21రౌండ్స్, టేబుల్స్ 20 ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యా లెట్ కోసం 1టేబుల్ ఏర్పాటు చేయటం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గంలో 418పోలింగ్ కేంద్రాలు ఉండగ 21రౌండ్స్, టేబుల్స్ 20, పోస్టల్ బ్యాలెట్ కోసం 2టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగ టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఈవిఎంల కౌంటింగ్ పూర్తి జరిగే వరకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తి చేయాలన్నారు. ఒక వేళ ఈవిఎంల ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యేలోగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పూర్తి కాకుంటే చివరి రౌండ్ ఈవిఎంల లెక్కింపును నిలిపి వేసి పోస్టల్ బ్యాలెట్ లెక్కించటం జరుగుతుందన్నారు. ఆ తరువాత చివరి రౌండ్‌లో ఈవిఎంల లెక్కింపు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించిందన్నారు. ఈ సారి ఐదు నియోజకవర్గాలకు సంబంధించి సుమారు 9889పోస్టల్ బ్యాలెట్లు వినియో గించుకున్నారని జిల్లా కలెక్టర్ గౌతమ్ వివరించారు. జిల్లా వ్యాప్తంగ ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 126మంది అభ్యర్థులు పోటీ చేయటం జరిగింది. ఆదివారం మధ్యా హ్నం వరకు ఓట్ల లెక్కింపు ఫలితాలతో పోటీ చేసిన ఎమ్మెల్యే అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. ఇక ఓట్ల లెక్కింపు కోసం ఎదురుచూపులతో ఉండి అభ్యర్థులలో,పార్టీల నాయకుల్లోనూ టెన్షన్ టెన్షన్ కొనసాగుతుందని చెప్పవచ్చు. అయితే జిల్లా వ్యాప్తంగ 15,83,675మంది ఓటర్లు ఓటు హక్కును (56.17శాతం) వినియోగించుకున్న సంగతి తెలిసిందే.

## అభ్యర్థులకు తప్పని తిప్పలు.. పోలింగ్ తీరుపై ఎఫెక్ట్

**షాద్‌నగర్, డిసెంబర్ 2, (ప్రభాతవార్త) :** ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రధాన అభ్యర్థులు ఎన్నో వ్యూహాలు ప్రతి వ్యూహాలు రచిస్తూ, ప్రచారం ఘనంగా నిర్వహించారు. కానీ వారి వెంట ఉండే కొంత మంది నాయకులు దొరికిందే ఛాన్స్ అని వారి చేతి వాటం, దుర్బుద్ధిని చూపించే సరికి అసలుకే ఎసరు వచ్చే పరిస్థితి నెలకొంది. వెంటే ఉంటూ వెన్నుపోటు పొడిచే విధంగా వ్యవహరించారు. ప్రస్తుతం షాద్‌నగర్ నియోజకవర్గంలో ప్రధానంగా నలుగురు అభ్యర్థులు ఎన్నికలలో ముమ్మర ప్రచారం నిర్వహించి గెలుపుపై ఆశలు పెంచుకున్నారు. తీరా చివరి రెండు రోజుల్లో చోటమోట నాయకుల తీరుతో అసలు నాయకులు చిక్కుల్లో పడ్డారు.

**చేతి వాటం చూపించిన నాయకులు**

ప్రచారం ముగిసిన అనంతరం ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నాయకులు నానా ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల ఓటర్లను ప్రలోబపెట్టడానికి సహితం నాయకులు వెనకడాలేదు. ఓట్ల కోసం ప్రధాన అభ్యర్థులు విచ్చల విడిగా డబ్బులు, మద్యం, పట్టుచీరలు, పట్టగొలుసులు అంటూ ఎవరికీ వారు ప్రజలకు అందించడానికి సర్వం సిద్ధం చేసుకున్న నాయకులు ప్రచారం ముగిసిన అనంతరం కింది స్థాయి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఓటర్లకు పంపిణీ చేయించారు. కానీ ఇక్కడ ఆ సామాన్య నాయకులు, కార్యకర్తలు తమ చేతి వాటం స్పష్టంగా చూపించారు. నాయకులు చెప్పినంత ఇవ్వకుండా అందినకాడికి అందినంత నొక్కేశారని వినికిడి. కేవలం తమ వారికి మాత్రమే ఎక్కువ మొత్తంలో ముట్టజెప్పి మిగతా వారికి ఉత్తచేతులు చూపించారని చాలా చోట్ల ప్రజలు నిట్టుర్చారు. దీంతో ఎన్నికలు మధ్యాహ్నం వరకు ఎన్నికలు మందకోడిగా కొనసాగడానికి ఇదీ ఓ కారణం అయినట్లు పలువురు బాహటంగానే చర్చించుకున్నారు. ఇదే కాకుండా వెంటే ఉంటూ వెన్నుపోటు పొడిచే విధంగా కొంత మంది నాయకులు క్రాస్ ఓట్లు వేయించినట్లు విశ్వసనీయ సమాచారం.

**కొన్ని గ్రామాల్లో క్రాస్ ఓట్లు**

ఈ దఫా ఎన్నికలు ప్రధాన అభ్యర్థులకు మింగుడు పడకుండా చేశాయి అనడంలో అతియోక్తి లేదు. ఒక పక్క చోటమోట నాయకులు తమ చేతివాటం చూపించడంతో ఓటర్లను, నాయకులను మోసం చేశారని విమర్శలు వస్తున్నాయి. మరో పక్క ఎన్నికల ముందు జంప్ జిలానీలుగా పార్టీలు మారిన కొంత మంది నాయ కులతో అంతకుముందు ఆయా పార్టీలో ఉన్న నాయకు లకు పొసకపోవడంతో అంతర్గతంగా పార్టీకి ప్రచారం చేస్తూనే క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారనే విషయం స్పష్టంగా కనిపిస్తుంది. నియోజకవర్గంలో నందిగామ, కొత్తూరు, ఫరూఖ్‌నగర్, కేశంపేట తదితర మండలాల్లో చాలా చోట్ల కొత్త నాయకులు రావడంతో పాత నాయకులు ఎడ మొహం పెడ మొహం అన్నట్లుగా వ్యవహరించారని రాజకీయ విశ్లేషకులు వివరించారు.

**పాపం అభ్యర్థులు**

ఓటర్లకు అందజేయాల్సి న దాంట్లో కింది స్థాయి నాయకులు చేతి వాటం చూపించడంతో ప్రధాన అభ్యర్థులు చిక్కుల్లో పడ్డారు. ఎటు చూసిన సామాన్య ప్రజలు నిట్టూర్పులు, ఇసడింపులతో అభ్యర్థులపై కోపతాపాలు పెంచుకున్నట్లు అర్థమవుతుంది. పలు గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజలు బహిరంగంగానే నాయకుల మోహం మీదే చెప్పేశారు. మరి కొంత మంది మాత్రం ఆ కోపాన్ని ఓటు వేసే విషయంలో స్పష్టంగా చూపించా రు. ఓటర్లకు సరిగ్గా పంచలేని నాయకులకు ఓట్లు ఎందుకు వేయాలని ప్రజలు బాహటంగానే విమర్శిస్తు మధ్యాహ్నం వరకు ఓట్లు వేయకపోవడం గమనార్హం. కొంత మంది సీనియర్ నాయకుల చోరవతో అక్కడక్కడ ఓటర్లు తమ ఓట్లను వినియోగిం చుకున్నారు. చేతి వాటం చూపించే ఇలాంటి నాయ కులతో ప్రధాన అభ్యర్థులు నష్టపోయే పరిస్థితి నెలకొంది. ఈ రకంగా వ్యవహరించిన చోటమోట నాయకులతో ఓట్లపై గ్రామాల్లో చాలా ప్రభావం చూపించింది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## కౌంటింగ్ ప్రక్రియకు సర్వం సిద్ధం

### జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ నారాయణ రెడ్డి

**పరిగి డిసెంబరు2,ప్రభాతవార్త :** కౌంటింగ్ ప్రక్రియకు సర్వంసిద్ధం చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం పరిగి పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను సందర్శించి కౌంటింగ్ ఏర్పాట్లపై కలెక్టర్ ఆరా తీశారు. కౌంటింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ విధులు నిర్వహించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, అసిస్టెంట్ సూపర్‌వైజర్లు,మైక్రో అబ్జర్వ్‌లకు శిక్షన ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా సిబ్బందిని ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ...కౌంటింగ్ అధికారులు అందరూ సమన్వయంతో సమిష్టిగా పని చేయాలన్నారు.కౌంటింగ్ ప్రక్రియలో సూపర్‌వైజర్ల పాత్ర చాలా కీలకమని పారదర్శకంగా కౌంటింగ్ విధులు నిర్వహించాలన్నారు.ప్రతి ఒక్కరూ ఉదయం 5 గంటల వరకే గుర్తింపు కార్డుతో సహా కౌంటింగ్ హాల్లో ఉండాలని కలెక్టర్ తెలిపారు.కలెక్టర్‌తో పాటు కౌంటింగ్ పరిశీలకులు స్నేహ హిందు రావు పాటిల్,సాధన పరిశీలకులు పి.ఆకాష్,రిటర్నింగ్ అధికారులు రాహుల్ శర్మ,లింగ్యా నాయక్, శ్రీనివాస రావు,విజయకుమారిలతో పాటు జిల్లా పరిషత్ సీఈవో జానకి రెడ్డి,డిఎస్‌హెచ్ఓ చక్రపాణి, డివైఎస్ఓ హనుమంత రావు,డిటిడిఓ కోటాజీ,పరిశ్రమ శాఖ అధికారి వినయ్ కుమార్,ఎస్సీ కార్పొరేషన్ ఈడి బాబు,మోజెస్ తదితరులు ఉన్నారు.


సమావేశానికి హాజరైన అధికారులు

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

### కూరగాయల అలంకరణలో అమ్మవారు


కూరగాయల అలంకరణలో అమ్మవారు

**కడ్తాల్,డిసెంబరు 2 ప్రభాతవార్త :** మైసిగండి మైసమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం, మంగళవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి కూరగాయల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నియమనిష్టలతో బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ట్రస్టు ఛైర్మన్ శిరోలి పంతునాయక్, ఆలయ ఈఓ స్నేహలతలు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పంతం నీదా..నాదా..?

### ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ
### నేడు తేలనున్న అభ్యర్థుల భవితవ్యం

**కొడంగల్,డిసెంబర్ 2ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల్లో పంతం నీదా.. నాదా..అనే తీరులో తలపడిన కాంగ్రెస్,బీఆర్ఎస్ అభ్యర్దుల భవితవ్యం నేడు తేలనుంది.ఎన్నికల కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ షురూ కావడంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్దులతో పాటు ఆయా పార్టీల నాయకుల్లో టెన్షన్ నెలకొంది.పర్గి నియోజకవర్గ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.ఇందుకుగాను ఓట్ల లెక్కింపు కేంద్రంలో 3 అంచెల భద్రత వ్యవస్థను ఏర్పాటు చేశారు.ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభం కానున్న ఓట్ల లెక్కింపులో ముందుగా పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపును అధికారులు చేపట్టనున్నారు.అనంతరం 8:30 గంటలకు ఈవీఎంలో నిర్లప్తమైన ఓట్ల లెక్కింపును చేపట్టనున్నారు. కాగా గత నెల రోజులుగా కొడంగల్‌లో పట్టు సాధించేందుకు అధికార పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేయగా ఎలాగైనా ఈ సారి ప్రతికారం తీర్చుకోవాలనే కసితో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ నాయకులు వ్యూహాలకు పదను పెట్టడంతో విజయం ఎవరిని వరిస్తుందో మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే మరి.

## సజావుగా సాగిన మండల సర్వసభ్య సమావేశం

**పూడూరు, డిసెంబర్ 2, ప్రభాతవార్త ;** పూడూరు మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది.శనివారం పూడూరు మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి అద్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నికల కోడ్‌వల్లమంజూరైన పనులతో పాటు,అర్ధాంతరంగా ఆగిపోయిన పనులు తిరిగి త్వరగా ప్రారంభించాలన్నారు.గ్రామాల్లో ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని,అధికారులు,ప్రజాప్రతినధులు సమన్వయంతో పనిచేసి గ్రామాబివృద్ధికి సహకరించాలని సూచించారు.ఈ కార్యక్ర మంలో వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి,పిఎసిఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల సర్పంచుల సంఘం అద్యక్షుడు అనంతరెడ్డి, ఎంపిడిఓ, ఉమా, సూపరిం టెండెంట్ వరలక్ష్మి,పలు గ్రామాల ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

## 5 నుంచి దారూర్ క్రైస్తవ జాతర

**నారాయణఖేడ్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా దారూర్‌లో ఈనెల 5వ తేది నుంచి 10వ తేది వరకు మెథోడిస్టు చర్చి దారూర్ క్రైస్తవ జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నట్లు నారాయణఖేడ్ జిల్లా డీఎస్ రెవ. ఆర్.సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన నారాయణఖేడ్ మెథడిస్టు చర్చి సమావేశంలో మాట్లాడుతూ..ఇండియాలో అతి ప్రాముఖ్యమైన మెథోడిస్టు క్రైస్తవ జాతరఅని అన్నారు. ఈ జాతర కార్యక్రమం హైదరాబాద్, బెంగళూరు రీజినల్ కాన్ఫరెన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.బి.ఆర్‌సీ, బిషప్ డా. ఎం.ఎ. డానియేలు, బిషప్ ఎన్.ఎల్. కర్‌కరే బీఆర్‌సీ., ప్రసంగీకులు బిషప్ ఎన్.ఎల్. కర్‌కరేలు హాజరవుతున్నట్లు తెలిపారు.పిల్లల ప్రత్యేక కార్యక్రమం, ఆరాధన, ప్రార్థనలు, ప్రభు రాత్రి భోజన సంస్కారం రోగుల కొరకు స్వస్థత ప్రార్థనలు చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలోని క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని ఆశీర్వాదములు పొందగలరని కోరారు. ఆదివారం ఆరాధన కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు జరుపబడును. ఈ కార్యక్రమంలో ఫాస్టర్లు ంరెవ.రెండ్, ఆర్.మనోహర్,రెవ రెండ్ జాషువ గాలివర్, తదితరుల పాల్గొన్నారు.

## జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి జాతీయ స్థాయి అవార్డులు



జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి మూస్కాన్ అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ డాక్టరు శ్రీధర్ శేషు

**జహీరాబాద్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** జహీరాబాద్ లోని వైద్య విధాన పరిషత్ ప్రాంత ఆసుపత్రికి ఉత్తమ సేవలకు గాను జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు లభించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు శ్రీధర్, వైద్యులు శేషగిరిరావులు వెల్లడించారు. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య శాఖ వారు ఈ అవార్డులను ప్రకటించిందని వారు తెలిపారు. నవజాత, శిశు ఆరోగ్య పరిరక్షణ , శిశు మరణాల తగ్గింపు నాణ్యమైన వైద్య సేవలు అందించినందుకు జాతీయ స్థాయిలో ముస్కాన్, ఎన్కాస్, లక్ష, బిహెచ్‌ఫ్‌ఐ వంటి జాతీయ అవార్డులు లభించినట్లు వారు తెలిపారు. అక్టోబరు 7,8 తేదిల్లో కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ బృందం ఆసుపత్రిని సందర్శించి వైద్యుల సేవలు ఆసుపత్రి నిర్వాహణ వంటిని పరిశీలించి 87 మార్కులతో అవార్డుకు సిఫారసు చేసిందని వారు తెలిపారు. ఈ జాతీయ స్థాయి అవార్డులు పొందడం వలన ప్రతి సంవత్సరం ఆసుపత్రికి రూ.9 లక్షలు మూడు సంవత్సరాల పాటు కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ అవార్డు కావడానికి సహకరించిన జిల్లా కలెక్టరు డాక్టరు శరత్, డీఎం అండ్‌హెచ్‌ఓ గాయత్రీదేవి, డిసి.హెచ్‌ఓ కె. సంగారెడ్డిలకు ఈ సందర్భంగా వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది మంజూలత పాల్గొన్నారు.

## నేడే ఉత్కంఠపు తెరదింపుడు

**జహీరాబాద్, డిసెంబర్ 2 ప్రభాతవార్త:** జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి నవంబర్ 30వ తేదిన జరిగిన ఎన్నికల పోలింగ్‌కు కౌంటింగ్ ఆదివారం ఉదయం 8 గంటలకు పటాన్‌చెరువు మండలం రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరుగనుంది. నియోజకవర్గంలో మొత్తం 2లక్షల 70 ఓట్లు ఉండగా అందులో 2,07,748 ఓట్లు పోలయ్యాయి. జహీరాబాద్ నియోజకవర్గం కౌంటింగ్ సంబంధించి మొత్తం 314 పోలింగ్ స్టేషన్లో కాగా 18 టేబుల్స్ ఏర్పాటు చేసి 18 రౌండ్లలో పోలింగ్ లెక్కించనున్నరున. మధ్యాహ్నం 12 గంటల వరకు ఫలితం వెలువడే అవకాశం ఉంది. 1511 బ్యాలెట్ ఓట్లు పోలయ్యాయి.

## కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడి సరికాదు



రాజేందర్‌ను పరామర్శిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, నవంబర్ 2, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ నాయకులపై దాడికి పాల్పడుతున్న బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు త్వరలోనే తగిణ గుణపాఠం చెబుతామని అ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని బోనగిరి రాజేందర్ అనే కాంగ్రెస్ నాయకుడిపై శుక్రవారం బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరచగా ఈ విషయం తెలుసుకున్న సత్యనారాయణ శనివారం రాజేందర్‌ను పరామర్శించి సంఘటనను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు అధైర్యపడొద్దని పార్టీ అండగా ఉంటుందన్నారు. అయన వెంట పార్టీ నాయకులు ముక్కిస రత్నాకర్‌రెడ్డి, ఒగ్గు దామోదర్, పోచయ్య, రవి, వెంకటేశ్వరరావు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం కెసిఆర్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం

**చిన్నకోడూరు, నవంబర్ 2, ప్రభాతవార్త:** ప్రతిపక్షాల దిమ్మ తిరిగేలా ఈనెల 3న వెలుబడే ఫలితాలు సిఎం కెసిఆర్‌కు అనుకూలంగా రానున్నాయని బిఆర్‌ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. బిఆర్‌ఎస్ సంపూర్ణమైన మెజార్టీ స్థానాలను సాధించి తిరిగి అధికారంలోకి వచ్చితీరుతుందన్నారు. మూడో సారి సిఎంగా కెసిఆర్ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధియే ధ్యేయంగా ముందుకు సాగిన బిఆర్‌ఎస్‌కే తిరిగి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్‌ఎస్ పార్టీకి తప్ప ఇతర పార్టీలకు స్థానం లేదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సామల మధు, మిట్టపల్లి గణేష్, శ్రీనివాస్, కోనేటీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులు

# కౌటింగ్ కేంద్రాల సరిపర ప్రాంతాల్లో 144 సెక్షన్

### -జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

**మెదక్ అర్బన్, డిసెంబర్2 ప్రభాతవార్త:** కౌటింగ్ కేంద్రాల సరిపర ప్రాంతాల్లో నేడు ఉదయం 6 గంటల నుండి రేపు ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శి తెలిపారు. శనివారం జిల్లా ప్రజలు, ఎన్నికల సిబ్బంది, పార్టీ అభ్యర్థులు, ప్రధాన ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లకు పలు సూచనలు చేశారు. నేడు శాసన సభ అభ్యర్థుల ఓట్ల లెక్కింపు హవేళిగనపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైపీఆర్ కళాశాలలో ఉన్నందున ప్రజలు సహకరించాలన్నారు. కౌటింగ్ కేంద్రాల సరిపర ప్రాంతాల్లో నేడు ఉదయం 6 గంటల నుండి రేపు ఉదయం 6 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఒక కిలోమీటర్ రేడియస్ వరకు ప్రజలు గుమిగూడవద్దన్నారు. మద్యం అమ్మకాలు నేడు ఉదయం 6 గంటల నుండి రేపు ఉదయం 6 గంటల వరకు నిషేధించినట్లు తెలిపారు. ఎవరు కూడా టపాసులు కాల్చరాదన్నారు. గెలుపొందిన అభ్యర్థులు నేడు విజయోత్సవ ర్యాలీలు తీయడం నిషేధమని, రేపు ర్యాలీల నిర్వహణకు పోలీసు అధికారుల నుండి రాతపూర్వకంగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా నియమ నిబంధనలు పాటించకపోతే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. వైపీఆర్ కళాశాలలో అసెంబ్లీ ఎన్నికల కౌటింగ్ ఉన్నందున ఉదయం 6 గంటల నుండి ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు జనరల్ ట్రాఫిక్, సామాన్య ప్రజలకు ఈ రోడ్డు మార్గం అనుమతించబడదని, ఈ సందర్భంగా వైపీఆర్ కళాశాలకు వెళ్లే మార్గాల నుండి ప్రవేశం లేదని తెలిపారు.

# ఆన్ జాబ్ శిక్షణతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు...

### -జిల్లా ఇంటర్ విద్యాధికారి సత్యనారాయణ

**రామాయంపేట, డిసెంబర్ 2, ప్రభాతవార్త ః** ఒకేషనల్ విద్యార్థులు చదువుతోపాటు ఆన్ జాబ్ శిక్షణ చేస్తే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని మెదక్ జిల్లా ఎంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ అన్నారు. శనివారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎలక్ట్రికల్, ఆఫీస్ అసిస్టెంట్ షిప్, అకౌంటెంట్ టాక్సేషన్ గ్రూపులకు చెందిన ఒకేషనల్ విద్యార్థులు పట్టణంలోని వివిధ బ్యాంకులతో పాటు ఎలక్ట్రికల్ మోటార్ వైండింగ్ షాపులలో ఆన్ జాబ్ శిక్షణా చేస్తున్నారు. అట్టి కేంద్రాలను జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి సత్యనారాయణ సందర్శించారు. అక్కడ విద్యార్థులు నేర్చుకుంటున్న పనితీరును పరిశీలించారు. ఇప్పటివరకు విద్యార్థులు నేర్చుకున్న శిక్షణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆన్‌జాబ్ శిక్షణా చేయాలని సూచించారు. చదువుతోపాటు ఇట్టి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో స్వయం ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు సులువుగా లభించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఈనెల 30 వరకు ప్రతి విద్యార్థి శిక్షణలో ఉండాలని ఆదేశించారు. ఒకేషనల్ చదివే విద్యార్థులకు భవిష్యత్తులో ఎన్నో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విద్యార్థులు చేస్తున్నా ఆన్‌జాబ్ శిక్షణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణలో ఉన్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఒకేషనల్ విభాగం అధ్యాపకులు బాలప్రకాష్, శ్రీనివాస్, అశోగౌడ్, శ్రీనివాసచారి, నర్సింలుగౌడ్, శ్రీదేవి, బ్యాంకు మేనేజర్లు ప్రవీణ్, హరీష్, ఎలక్ట్రికల్ మోటార్ వైండింగ్ షాప్ నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం


# చారిమెట్ల దేవస్థానంలో భక్తుల ప్రత్యేక పూజలు



చాకరిమెట్లలో పూజలు నిర్వహిస్తున్న ఆంజనేయ శర్మ, అర్చకులు

**శివ్వంపేట, డిసెంబర్2 ప్రభాతవార్త:** ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శివ్వపేట మండల పరిధిలోని చాకరిమెట్లలో వెలసిన శ్రీ సహకార ఆంజనేయ స్వామి దేవస్థానంలో శనివారం అధిక మొత్తంలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. కార్తీక మాసం శనివారం కావడంతో ఉదయం నుండి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామికి అభిషేకం, అర్చనలు, ఆకుపూజ, శనిగ్రహ పూజలతో పాటు వివిధ రకాల పూజలు చేపట్టిన అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రతి శనివారం మాదిరిగానే ఈ వారం కూడా భక్తులకు వంటలు చేసుకొని అటవీ ప్రాంతంలో వన భోజనాలు చేయడం జరిగింది. సత్యనారాయణ వ్రత మండపంలో అనేక మంది దంపతులు వ్రతాలు నిర్వహించి ఆంజనేయ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో చాకరిమెట్ల దేవస్థానం పరిసరాలు భక్తిపారవశ్యంలో మునిగిపోయాయి. భక్తుల పౌకర్యార్థం దేవస్థానం పాలకమండలి అన్నదాన సత్రంలో అన్నదాన వితరణ ఏర్పాటు చేయడం జరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఫౌండర్ చైర్మన్ ఆంజనేయ శర్మ, కార్యనిర్వహణాధికారి సార శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవదత్తు శర్మ, అర్చకులు ప్రభురాజశర్మ, శ్రీవాత్సవ శర్మ, దేవిశ్రీశర్మ, వికాస్ శర్మ, సిబ్బంది రామకృష్ణ, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# హుస్నాబాద్‌లోనే గాలిలో చక్కర్లు కొడుతున్న పోస్టల్ బ్యాలెట్లు ?



ఎలాంటి రక్షణ లేకుండా వ్యాన్‌లో పడేసిన పోస్టల్ బ్యాలెట్ బాక్సుల దృశ్యం




మోడల్ స్కూల్ ముందు శనివారం రాత్రి వరకు ఉన్న బ్యాలెట్ బాక్సులు ఉన్న వ్యాన్ దృశ్యం

**హుస్నాబాద్,డిసెంబరు2,ప్రభాతవార్త** ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభ్యర్థుల భవితవ్యం తేల్చే పోస్టల్ బ్యాలెట్ బాక్సులు పట్టణంలోని మోడల్‌పాఠశాల ప్రాంతంలోనే గాలిలో చక్కర్లు కొడుతూ అభ్యర్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.30న జరిగిన ఎన్నికల బ్యాలెట్ బాక్సులతో పాటు సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలాల్సిన ఈ పోస్టల్‌బ్యాలెట్ బాక్సులు మాత్రం ఇక్కడనే దర్శనమిస్తున్నాయి. 24బ్యాలెట్‌బాక్సులు దాదాపు 1480ఓట్లు ఇందులో పోల్ అయినట్లు అధికార వర్గాల సమాచారం.ఎలాంటి రక్షణ లేకుండా హుస్నాబాద్ లో మోడల్‌స్కూల్ ఆవరణలో లారీలో బహిరంగంగా దర్శనమివ్వడంతో ఇక్కడ చూసిన వారు అధికారుల తీరుపై ఈ బాక్సుల రక్షణ సైతం ఎలాంటి ఏర్పాట్లు లేకపోవడంతో ముక్కున వేలేసుకుంటున్నారు. తెల్లారితే ఓట్ల లెక్కింపు ప్రారంభం కావాలసి ఉండగా శనివారం రాత్రి కూడా ఈ బ్యాలెట్‌బాక్సులు ఇంకా తరలించకుండా ఇక్కడే ఉంచడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం విషయంలో ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మా వైపే చాన్స్..!

- -రాజకీయ వర్గాల్లో హై టెన్షన్
- -ఎగ్జిట్ పోల్ ఫలితాలపై కాంగ్రెస్‌లో ఉత్సాహం
- -ఓటరు నాడి మాకే అనుకూలమంటూ బిఆర్‌ఎస్
- -శ్రేణుల ధీమా -బిసిలదే రాజ్యమంటున్న బిజెపి?

**హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త** నెల రోజుల ఉత్కంఠకు నేడు తెరపడనుంది. రసవత్తరంగా సాగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై అన్ని వర్గాల్లో ఇప్పుడు ఆసక్తి నెలకొన్నది. గెలుపు, ఓటమిలపై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.ఏ నియోజకవర్గంలో ఎవరికి ఓట్లు అధికంగా వేశారు..అనేది అందరిలో సస్పెన్స్ నెలకొంది. ఇప్పటికే ఎగ్జిట్ పోల్స్ కూడా రిజల్ట్స్ ప్రకటించాయి. గత రెండు అసెంబ్లీ ఎన్నికల సమయంలో బిఆర్‌ఎస్-కాంగ్రెస్ పార్టీల మధ్యే ప్రధానంగా పోటీ సాగింది. ఈసారి మాత్రం మూడు పార్టీలతో ముక్కోణపు పోటీ నెలకొంది. మెజారిటీ నియోజకవర్గాల్లో బిఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మధ్య ముఖాముఖి పోటీ ఉంటే కొన్ని చోట్ల మాత్రం ముక్కోణపు పోటీ కనిపించింది. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ నిర్వహిస్తారు. అందుకు తగ్గ ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పూర్తి చేశారు. దీంతో గెలుపు, ఓటమిలపై ప్రధాన పార్టీ అభ్యర్థులు ఉత్కంఠతగా ఎదురుచూస్తున్నారు. సర్వేలతో పనిలేదని కొన్ని పార్టీలనేతలు చెపుతుంటే సర్వేలన్నీ మాకు అనుకూలమేనని కొన్ని పార్టీలు చెప్పుకుంటున్నాయి. ముఖ్యంగా బిఆర్‌ఎస్‌లో నెలకొన్న ఆందోళనను పారద్రోలేందుకు అధినేత కెసిఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. భయపడకండి మనమే గెలుస్తున్నాం మనదే మళ్లీప్రభుత్వం అంటూ ధీమా ప్రకటిస్తున్నారు.తనయుడు కెటిఆర్ కూడా అదేరీతిలో సర్వేలపై నమ్మకంలేదన్నారు. గతంలో సర్వేలు తల్లకిందులయిన సందర్భాలను గుర్తుచేస్తున్నారు. ఇక బిజెపి అయితే రంగంలో ఉన్నా మేకపోతు గాంభీర్యంతోనే ఉందనిచెప్పాలి. ప్రభుత్వం ఏర్పాటుచేసే మెజార్టీ మార్కు సీట్లు ఏ సంస్థ సర్వేలో కూడా రాలేదు. అయినా కూడా మెజార్టీస్థానాలు దక్కించుకుని ప్రభుత్వం ఏర్పాటులో కీలకం కావాలన్న లక్ష్యంతో ఉంది. ఇక కాంగ్రెస్ పరంగా అయితే ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడో తేదీ సాయంత్రం నుంచే విజయోత్సవాలు నిర్వహించుకోవచ్చని రాష్ట్రంలోని హస్తం కేడర్‌కు సందేశాలు పంపించేసారు. రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ఇందిరమ్మ రాజ్యం సర్వమత సమానత్వంతో ముందుకుపోతామని చెపుతున్నారు. ఇక ముఖ్యమంత్రి అభ్యర్థులపై ఎవరన్నది ఉత్కంఠ వీడనప్పటికీ రేవంత్, భట్టి, సీతక్క పేర్లు ఎక్కువ వినిపిస్తుండటంతో కేడర్‌లో ఎక్కువ ఆసక్తినెలకొంది. ఇక ప్రధాన పార్టీలపరంగా బిఆర్‌ఎస్‌కు ముఖ్యమంత్రి కెసిఆర్ అన్న అంశంలో వేరే వాదన అనేది ఉండదు. ఇక కాంగ్రెస్ పరంగా భట్టి, రేవంత్‌లపేర్లు వినిపిస్తున్నా రంగంలో తెరవెనుక ముచ్చట్లు అనేకం ఉన్నాయి. బిజెపి ఒకవేళ అధికారంలోకి రాగలిగితే ఈటెల, పేరు తెరపైకి వస్తోంది. బిజెపి ప్రభుత్వం వస్తే బిసి అభ్యర్థి ముఖ్యమంత్రి అవుతారన్నది బిజెపి నినాదంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ ప్రచారం, లోపాయికారీ రాజకీయాలు ఒక ఎత్తయితే ప్రజలు మాత్రం ఓట్లలెక్కింపు తేదీకోసమే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# నేడు వైన్ షాపులు బంద్

**హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవాం** అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ఆదివారం జరగనుంది. ఈ మేరకు వైన్‌షాపు యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. రెస్టారెంట్లు, క్లబ్బులు, స్టార్ హోటళ్లకూ ఈ నిబంధన వర్తిస్తుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసు కమిషనర్ సందీప్ శాండిల్య హెచ్చరించారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మద్యం షాపులు బంద్ చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నగరంలోని వైన్‌షాపులను మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు.ఆదివారం జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశామన్నారు. కాగా వైన్ షాపులు మూతపడతాయన్న వార్త విని మందు బాబులు వైన్స్‌కు పరుగులు తీశారు.

**గ్రేటర్‌లో కొత్తగా 615 మద్యం దుకాణాలు...**

కొత్తగా 615 మద్యం దుకాణాలకు ఎక్సైజ్ శాఖ అనుమతి ఇచ్చింది. గ్రేటర్ పరిధిలోని మూడు జిల్లాల్లో అనుమతుల పొందిన కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమయ్యాయి. గత ఆగస్టులో 615 వైన్ షాపులకు ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా నోటిఫికేషన్ వెలువడడంతో వ్యాపారుల నుంచి అనూహ్య స్పందన లభించింది.గ్రేటర్‌లో చాలా చోట్ల పెద్ద ఎత్తున పోటీ చేశారు. ప్రభుత్వం ఒక్కో మద్యం దుకాణానికి రూ.2లక్షలు, వ్యాపారి ఎన్నిషాపులకైనా టెండర్ వేయవచ్చని ప్రభుత్వం చెప్పడంతో ఒక్కో వ్యాపారి నుంచి ప్రభుత్వానికి భారీగా దరఖాస్తులు వచ్చాయి. శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాలో 100 వైన్ షాపులకు మనఆరతమే 9వేల మంది పోటీ పడ్డారు. ఇక్కడ సరూర్‌నగర్‌లో 1359 వేల మంది వైన్ షాపులకు టెండర్ వేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని 615 దుకాణాలపై ప్రభుత్వానికి లైసెన్స్ ఫీజు రూపంలో రూ.650 కోట్లు వచ్చినట్లు అంచనా. అయితే శివారులోని ఉప్పల్, మేడిపల్లి, శేరిలింగంపల్లి, కుషాయిగూడ, కీసర, శంషాబాద్‌లోని వైన్ షాపులతో పాటు ఇతర ప్రాంతాల్లోని మద్యం దుకాణా3లకు భారీగా డిమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఆగస్టు 16న నోటిఫికేషన్ విడుదల చేసి అదే నెలాఖరుల డ్రాలు నిర్వహించారు. సాధారణంగా ప్రభుత్వం మద్యం దుకాణాలకు రెండేళ్లకు ఒకసారి లైసెన్సులు ఇస్తుంది. ఒకసారి లైసెన్స్ పొందిన వ్యాపారి రెండేళ్లపాటు దుకాణాన్ని నడపవచ్చు. ప్రతి రెండేళ్లకోసారి అక్టోబరు నెలాఖరున నోటిఫికేషన్ విడుదల చేసి నవంబరులో అనుమతులు ఇస్తారు. అదే నెలలో మొత్తం ఫీజులో నాలుగో వంతు చెల్లించిన వారికి డిసెంబరు 1న మద్యం షాపులకు చేరుతుంది. కానీ ఈసారి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆగస్టు నెలలోనే అధికారులు ఈ ప్రక్రియ చేపట్టారు. కొత్త మద్యం దుకాణాలకు లాట్ చేసి అనుమతి పొందిన వారు సెప్టెంబరు లోనే ప్రభుత్వానికి నాలుగో వంతు ఫీజు చెల్లించి.. మద్యం అమ్మకాలను అడ్డుకున్నారు. ఉదయం నుంచి మద్యం సరఫరా కావడంతో కొన్ని చోట్ల శుక్రవారం సాయంత్రం వరకు కొత్త దుకాణాలు తెరిచారు.

## శబరిమళకు పాదయాత్రగా తరలిన అయ్యప్ప స్వాములు



శబరిమళకు పాదయాత్రగా తరలివెళ్తున్న అయ్యప్ప స్వాములు

**పెద్దశంకరంపేట, డిసెంబర్2 ప్రభాతవార్త:** పెద్దశంకరంపేట మండలం నుండి కేరళ రాష్ట్రంలోని శబరిమళ అయ్యప్ప స్వామి సన్నిధానంకు శనివారం బాన్సువాడకు చెందిన వినయ్ కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో పాదయాత్రగా తరలి వెళ్లారు. ఎల్లారెడ్డి, జుక్కల్, నారాయణఖేడ్, పెద్దశంకరంపేటకు చెందిన అయ్యప్ప స్వాములు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పెద్దశంకరంపేటకు చెందిన గురూస్వామి రామచంద్రాచారి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మురళిలు వారికి ఘన స్వాగతం పలికి అన్నధానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, గురుస్వాములు రాములు, రామ్మూర్తి, శ్రీహరి, సాయిరాం, పరంధాం, విఠల్‌రావు తదితరులు ఉన్నారు.

## శ్రీ గురుపీఠం శిలాన్యాస ఆహ్వాన పత్రిక అందజేత



పైడి శ్రీధర్‌గుప్తకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న భిక్షపతి యాదవ్

**శివ్వంపేట, డిసెంబర్2 ప్రభాతవార్త:** శివ్వంపేట మండలం గూడూరు గ్రామంలో ఈ నెల 7వ తేదీన జరుగనున్న శ్రీ గురుపీఠం శిలాన్యాస కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ నర్సాపూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త పైడి శ్రీధర్‌గుప్తకు శనివారం శ్రీగురుపీఠం చారిటబుల్ ట్రస్టు సభ్యులు రాజ్యం భిక్షపతి యాదవ్ ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది. 7వ తేదీన ఉదయం 8.40 నిమిషాలకు దివ్యమైన ముహూర్తంలో శిలాన్యాస కార్యక్రమంలో గుంటూరు శ్రీ విశ్వంజీ విశ్వయోగి మహారాజ్ కర కమలములచే నిర్వహించడం జరుగుతుందని భిక్షపతి యాదవ్ తెలిపారు. అందుకు తగిన ఏర్పాట్లను శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్టు చూస్తుందన్నారు. ఈ పవిత్ర కార్యక్రమానికి భక్తులతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిపూర్ణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## డిపాజిట్ దక్కలేదు..అంటే!

**హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త** ఎన్నికల్లో అభ్యర్థులకు కనీసం డిపాజిట్ కూడా దక్కలేదనే మాట వింటుంటాం.1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 34(1)(ఏ) నిబంధన ప్రకారం పోటీ చేసే అభ్యర్థులు డబ్బు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం జనరల్ కేటగిరీ వారికి రూ.10వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5వేలు ఉంది. అభ్యర్థులు నామపత్రాలు దాఖలు చేసే సమయంలో ఈ సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. ఓట్ల లెక్కింపు పూర్తయిన తర్వాత విజేతలను ప్రకటిస్తారు. పోలైన ఓట్లలో ఆరింట ఒక వంతు (16.6 శాతం) తెచ్చుకున్న వారికి డిపాజిట్ సొమ్ము తిరిగిచ్చేస్తారు. మిగిలిన వారికి ఆ సొమ్ము రాదు. ఈ పరిస్థితుల్లో నుంచి వచ్చిందే 'డిపాజిట్ కూడా దక్కలేదు' అనే మాట.నియోజకవర్గాల్లో పోలైన మొత్తం ఓట్లలో 1/6వ వంతుకు మించి ఓట్లు పడిన వారికి డిపాజిట్‌ని తిరిగి ఇస్తారు. అంతకంటే తక్కువ పడితే ఆ డిపాజిట్‌ను ప్రభుత్వమే జప్తు చేసుకుంటుంది.

### వీర్లపల్లి శంకర్ ఎమ్మెల్యేగా గెలవాలని పూజలు

**నందిగామ డిసెంబరు 2,ప్రభాతవార్త :** షాద్‌నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వీర్లపల్లి శంకర్ భారీ మెజార్టీతో గెలవాలని చేగూరు కాంగ్రెస్ సీనియర్ నేత మంకాల శ్రీశైలం ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు శనివారం దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గట్టుపల్లి గ్రామంలో గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో వీర్లపల్లి శంకర్-అనురాధ దంపతుల మీద ప్రత్యేక పూజలు చేయించారు.జన హృదయనేత,విద్యావంతుడు వీర్లపల్లి శం కర్‌ను ఎమ్మెల్యేగా గెలిపించి షాద్‌నగర్‌కు వరం ఇచ్చేలా దీవిం చమని వేడు కున్నారు.

### ఘనంగా యుఫోని అకాడమిక్ ఫేస్ట్

**ఘట్‌కేసర్ రూరల్, డిసెంబర్ 2, ప్రభాతవార్త:** పోచారం మున్సి పల్ పరిధిలోని యంనంపేట్ రాక్ వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం యుఫోని అకాడమిక్ ఫేస్ట్ జరిగింది. పాఠశాల అకడమిక్ ఫేస్ట్‌లో భాగంగా శాస్త్ర సాంకేతిక, గణిత సాంస్కృతిక సామాజిక రం గాల్లో ప్రతిభా పాటవాలను ప్రతిబింబిచేలా విద్యార్థులు కార్యక్రమాలు చేపట్టారు. ఎలక్ట్రానిక్ ట్రాఫిక్ సిగ్నల్, రోమియో జూలియట్ నాటకం, ఫైర్ ఫైటింగ్ రోబో, బుర్రకథ నాటకం, థెర్మల్ ఎలక్ట్రీసిటి కన్వర్షన్, ప్లాంట్ సెల్ స్ట్రక్చర్, ఫంక్షన్, వెట్, వేస్ట్ సేగ్రేషన్, ఫైథా గోరేన్ థియరమ్ వంటి పలు నమునాలను ప్రదర్శించారు.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR, HYDERABAD (SOUTH)**
**ABR.CF.No: 484 OF 2022**
BETWEEN:-
**M/S MARGADARSI CHIT FUND PRIVATE LIMITED,** SANTHOSH NAGAR BRANCH, represented by its Foreman/ Branch Manager. **...DISPUTANT**
And
**Mrs. HEREKAR SWAPNA & OTHERS ...OPPONENTS**
To
**2. Mr. Gajabinkar Naveen Kumar,** S/o G. Shankar, DOB: 28/07/1982, Occ: Mutton Shop, R/o H.No.10-189, Indira Nagar, Prashanth Nagar, Siddipet-502103. Mob.No. 9849678123.
Please take notice that the above dispute is filed against you for recovery of **Rs.1,88,958/-** (Rupees One Lakh Eighty Eight Thousand Nine Hundred and Fifty Eight only) same is posted to **14/12/2023** for your appearance before the Office of Deputy Registrar of Chits Arbitrator, Hyderabad (South) at 03:00 pm If you fail to attend the Office of Deputy Registrar of Chits / Arbitrator on that day the matter will be heard and decided exparte.
//BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR//
**Sd/- FOREMAN / SR. BRANCH MANAGER FOR DISPUTANT COMPANY**

## 6న అంబేద్కర్ స్మారకోపన్యాసం-38

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: అంబేద్కర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ సాయంత్రం తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో భారత రత్న 'డా.బి.ఆర్.అంబేద్కర్ స్మారకోపన్యాసం-38' జరుగుతుందని ట్రస్ట్ తెలిపింది. శనివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ట్రస్ట్ ఛైర్మన్ డా.కె.లింగయ్య, ప్రధాన కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ 'విశ్వ వైతాళికుడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్' అనే అంశంపై డా.గంటా చక్రపాణి ఉపన్యాసం చేస్తారని చెప్పారు. ఈ సభలో అంబేద్కర్ అభిమానులు, మేధావుల, కవుల, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. తమ ట్రస్ గత 37 సంవత్సరాలుగా ప్రతి ఏడాది అంబేద్కర్ వర్ధంతి రోజున స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామని, ఇది 38వదని, ఎంతో మంది ప్రముఖులు పాల్గొన్నారని వారు వివరించారు.

## నారాయణ సేవలు మరువలేనివి

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రముఖ న్యాయవాది పి.వి.నారాయణ రావు వర్ధంతి సభ శనివారం నాడిక్కిడ లోక్‌దళ్ పార్టీ కార్యాలయం జరిగింది. ఈ సందర్భంగా లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నారాయణ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని, ఆ తరువాత న్యాయవాది పేద, బడుగు బలహీన వర్గాలు ప్రజలకు విశేషమైన సేవలు అందించారని ఆయన గుర్తు చేశారు. నారాయణ సేవలను స్ఫూర్తిగా తీసుకుని నేటి తరం యువత సమాజానికి సేవలు అందించాలని కోరారు. అంతకు ముందు రాజేశ్వర్ రావు, పలువురు నేతలు నారాయణ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

## తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి ఆదుకోండి



మాట్లాడుతున్న ఎస్.యాదగిరి,సంస్థ ఛైర్మన్ ప్రఫుల్ రాంరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తొలి, మలి దశలో జరిగిన ఉద్యమంలో పాల్గొని ఎంతో మంది ఉద్యమ కారులు తీవ్రంగా నష్టపోయారని వారిని గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం వచ్చేకాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని తెలంగాణ ఉద్యమకారుల సమితి ఛైర్మన్ ఎస్.యాదగిరి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల సమితి సమావేశం యాదగిరి అధ్యక్షతన కాచిగూడలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ప్రఫుల్ రాంరెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ మలిదశ అమరుడు శ్రీకాంతాచారి డిసెంబర్ 3న అమరుడయ్యాడని ఉద్యమ కారులను పూర్తిగా విస్మరించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దొర 10 సంవత్సరాల పీడ నుంచి తెలంగాణ విముక్తి కాబోతుందన్నారు. తెలంగాణ అమరుల కుటుంబాలు, ఉద్యమకారుల నిరంతర కృషితో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించబోతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన ఉద్యమకారులకు వారు కృతజ్ఞతలు చెప్పారు. అమరుల కుటుంబాలను, ఉద్యమకారుల సంక్షేమాన్ని దీప్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరికి నెలకు రూ.. 25 వేలు గౌరవ ఫించన్ ఇచ్చి జీవన బృతి కల్పించాలని రానున్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కో ఛైర్మన్ మంచాల వెంకటస్వామి, కల్లెపు చంద్రన్న ప్రసాద్,హరికృష్ణ తధితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిని కలిసిన అంబర్‌పేట కాంగ్రెస్ నేతలు



డాక్టర్ రోహిన్‌రెడ్డితో కలిసి రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న దిడ్డి రాంబాబు,పులి జగన్‌లు

హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త : పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని శనివారం అంబర్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నేతలు కలుసుకున్నారు. అంబర్‌పేట కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ సి.రోహిన్‌రెడ్డితో కలిసి జిహెచ్ఎంసి మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ పులి జగన్‌లు రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డిని శాలువ, పుష్పగుచ్ఛాన్ని అందించి అభినందించారు. కాంగ్రెస్ పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తీసుకొస్తున్నందుకు పిసిసి అధ్యక్షుడుని కలుసుకొని అభినందించినట్లు ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అలాగే అంబర్‌పేట కాంగ్రెస్ నాయకుడు కె.మురళీకృష్ణ న్యూఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వచ్చిన రేవంత్‌రెడ్డిని కలుసుకొని 'కాబోయే ముఖ్యమంత్రి రేవంతన్నా' అంటూ అప్యాయంగా పలకరించి అభినందించారు.

## మైనార్టీ ఓట్లే కీలకం

గన్‌ఫౌండ్రి, డిసెంబర్ 2 గోషామహల్ నియోజకవర్గంలో మైనార్టీ ఓట్లు కీలకంగా మారనున్నాయి. నియోజకవర్గంలోని 6 డివిజన్లలో జాంబాగ్,గన్‌ఫౌండ్రి,బేగంబజార్, గోషామహల్,దత్తాత్రేయనగర్,మంగళ్‌హాట్ డివిజన్లలో ఐదు మంది బిజెపి కార్పొరేటర్,ఒకరు మజ్లీస్ కార్పొరేటర్ ఉన్నారు.దత్తాత్రేయనగర్,జాంబాగ్,మంగళ్‌హాట్ డివిజన్‌లలో అత్యదికంగా మైనార్టీలు ఓట్లు అధికంగా ఉన్నాయి.అంతేకాక మైనార్టీ ఓట్లు చీలితే మరోసారికి అవకాశం ఉంటుంది.ఇలా మైనార్టీఓట్లు కీలకంగా మారనున్నాయి. సంక్షేమ ఫలితాల ద్వారా మైనార్టీలు బిఆర్ఎస్‌వైపు మొగ్గు చూపే అవకాశాలు అధికంగా ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతుంది.మైనార్టీ ఓట్లు బిఆర్ఎస్ పోలవ్వడంతో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని విశ్లేషించుకుంటున్నారు.

## జలమండలికి పిఆర్ఎస్ఐ నేషనల్ అవార్డు

### వరుసగా నాలుగోసారి నేషనల్ అవార్డు కైవసం
### హర్షం వ్యక్తం చేసిన ఎండి దానకిషోర్



హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త : జలమండలికి ఈ యేడాది మరోసారి పురస్కారం వచ్చింది. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పిఆర్ఎస్ఐ) నేషనల్ అవార్డు 2023 జలమండలి గెలుచుకుంది. పిఆర్ఎస్ఐ నిర్వహించిన ఇంటర్నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ పెస్టివల్ 2023లో కాఫి టేబుల్ బుక్ కేటగిరిలో రెండో బహుమతి లభించింది. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్, ఎన్‌టిపిసి, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఇతర మల్టినేషనల్ కంపెనీలతో పోటీ పడి అవార్డును దక్కించుకుంది. ఈ అవార్డు ప్రధాన కార్యక్రమం నవంబరు 27న ఢిల్లీలో జరిగింది. ఈ పురస్కారం రావటంపై ఎండి దానకిషోర్ హర్షం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లోని ప్రధానల కార్యాలయంలో పిఆర్ఓ సుభాష్, ఓఎస్‌డి పిఆర్ఓ మనోహరాచారి పురస్కారాన్ని ఎండికి శనివారం అందించారు. ఈ సందర్భంగా వారిని అబినందించారు. గత యేడాది సైతం పిఆర్ఎస్ఐ నిర్వహించిన పోటీల్లో జలమండలికి రెండు అవార్డు దక్కాయి. వివిధ కేటగిరిల్లో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ కమ్యునికేషన్ క్యాంపేయిన్, ప్రజా అవగాహన విభాగాల్లో జలమండలి మొదటి, మూడో బహుమతి గెలుచుకుంది. జలమండలి పిఆర్ఎస్‌న నేషనల్ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది నాలుగోసారి కావడం విశేషం. కాగా జలమండలి ఈ యేడాది ఇప్పటికే నాలుగు అవార్డులు గెలచుకుని. మార్చి 18న వరల్డ్ వాటర్ మే 1న ఉత్తమ యాజమాన్య, జూలై 5న పొల్యుషన్ కంట్రోల్ బోర్డు, ఆగస్టు 1న గ్లోబల్ ఇన్నోవేషన్ ఇన్ వాటర్ టెక్నాలజీ అవార్డులు వచ్చాయి. తాజా అవార్డులతో మొత్తం జలమండలి ఈ యేడాది ఐదు పురస్కారాలు తమ ఖాతాలో వేసుకుంది. ఈ కార్యక్రమంలో ఫిల్మ్‌డెవలప్‌మెంట్ కార్పోరేషన్ మాజీ పిఆర్ఓ మధుసూధన్ పాల్గొన్నారు.

## పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిసిన సత్యం శ్రీరంగం

కూకట్‌పల్లి, డిసెంబర్ 2, ప్రభాతవార్త : టిపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ సత్యం శ్రీరంగం కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన తీర్పుతో తెలంగాణ రా ష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ రథసారధి, తెలంగాణ ప్రజల్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తి చేస్తున్న ప్రియతమ నాయకులు పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని బలపరిచారని ఈ సందర్భంగా వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## బీసీనే సిఎం చేయాలని ఆనాడు కోదండరాం, హరగోపాల్ ఎందుకు అడగలేదు

తెలంగాణ బిసి సిఎం సాధన సమితి ఛైర్మన్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న గాలి వినోద్‌కుమార్

సైఫాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: మలిదశ తెలంగాణ ఉద్యమంలో సామాజిక, ప్రజాస్వామ్య ద్రోహులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్, ప్రొఫెసర్ జి.హరగోపాల్‌అని, అసలు తెలంగాణ వస్తే చాలు ఎవరు సిఎం అయినా పరవాలేదనడంతో సిఎంగా కెసిఆర్ ప్రమాణస్వీకారం చేశారని తెలంగాణ బిసి సిఎం సాధన సమితి ఛైర్మన్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిసినే సిఎంగా చేయాలని ఆనాడు ఎందుకు వారు అడగలేదని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపిలో 40 ఏళ్ళపాటు రెడ్డిలే సిఎంగా పనిచేశారని, నేడు కూడా టి-పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని సిఎంగా చేయాలని కోదండరామ్, హరగోపాల్ కోరాడం దారుణమన్నారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను సిఎంగా చేయమని వారు ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. ఏ రాజకీయ పార్టీ అధికారంలోకి వచ్చినా బిసినే సిఎంగా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అరశాతం ఉన్న వెలమలు, 5 శాతం ఉన్న రెడ్లు రాష్ట్రాన్ని పాలిస్తే 52 శాతం ఉన్న బిసిలు రాజ్యాధికారానికి అర్హులు కారా ? ఆయన ప్రశ్నించారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు కోదండరామ్, హరగోపాల్‌కు లేదన్నారు. వచ్చే ఫలితాల్లో బిసిని సిఎంగా చేయకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకమై అగ్రవర్ణ పార్టీలను చిత్తుగా ఓడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సమితి కన్వీనర్లు డా.చొప్పరి శంకర్‌ముదిరాజ్, నాగుల శ్రీనివాస్‌యాదవ్, ఓం ప్రకాష్, సాయికిషోర్, వెంకటేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాంపల్లి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఉప్పల్ బిఆర్ఎస్ అభ్యర్థి బిఎల్ఆర్



నాచారం, డిసెంబర్ 2 ప్రభాతవార్త: ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి నాంపల్లిలో ఉన్న ప్రముఖ యూసుఫెన్ దర్గాను మైనార్టీ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఉప్పల్ నియోజక వర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ భారి మెజార్టీతో గెలుపొందాలని కోరడం జరిగిందని బిఎల్ఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు బద్రుద్దీన్,నాయకులు కటార్ల భాస్కర్, గ్రేటర్ నాయకులు సాయిజన్ శేఖర్, మహబూబ్, బాల్ రెడ్డి, రాజి రెడ్డి,మక్బూల్, సయ్యద్, షేక్ రఫీక్,నజీర్ ఖాదర్, ఇర్ఫాన్, జియూ, అక్రమ్, హాజీ, ముధసీర్ గౌస్,కోటీ తధితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాలలో రాణించాలి : బచినేపల్లి శేఖర్ బాబు



సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ స్పోర్ట్స్‌డేలో ప్రసంగిస్తున్న బచినేపల్లి శేఖర్ బాబు

కంటోన్మెంట్, డిసెంబర్ 2 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చి జాతీయం, అంతర్జాతీయ పోటీల్లో రాణించాలని భువనగిరి పర్వత రోహణ శిక్షణా సూ ్కల్ అధ్యక్షులు బచినేపల్లి శేఖర్ బాబు పిలుపునిచ్చారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని దీ సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఏఓసి సెంటర్‌లోని గజరాజు స్టేడియంలో నిర్వహించిన నసమన్వయ్ స్పోర్ట్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెంది సమాజాబివృద్ధి కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్,కార్యదర్శి పి.జో ్యతి మధుసూదన్ రావ్, డైరెక్టర్లు శిల్పా రవి,సరస్వతీ, పూజా, జి.ఎం.ఉపేందర్ రవి, ఛీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ విజయ్ శంకర్, అకాడమిక్ డైరెక్టర్ ఎం.ఎం.అగస్టిన్, ప్రిని ్సపాల్ జె.సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు, ప్రశంసపత్రాలు, మెమోంటోలను అందజేశారు.

## నేడు ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తి.. 2 గంటలలోపు ఫలితం

### ఎన్నికల అధికారి వి.విక్టర్



గోషామహల్,డిసెంబర్ 2 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన ఓట్ల లెక్కింపునకు అవసరమైన అన్ని ఏర్పాట్ల అధికారులు చేపట్టారు.నవంబర్ 30 తేదిన ఎన్నికలు జరగగా పోలైన ఓట్లు లెక్కింపును డిసెంబర్ 3వ తేదిన ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రారంభిస్తామని గోషామహల్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్‌అధికారి వి.విక్టర్‌తెలిపారు.గోషామహల్ నియోజకవర్గంలో మొత్తం 2లక్షల70వేల1పై చిలుకు ఓట్లకు గాను,1లక్షల49వేల342ఓట్లు నమోదైన విషయమే పోలైన ఓట్లలో80వేలపై చిలుకుఓట్లు పురుష్యులువేయగా,మహిళలు69వేలపైగా ఓట్లు వేశారు.ఓట్లలెక్కింపు కోఠి ఉమెన్స్ కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాటు పూర్తిచేశారు.14టేబుళ్ల ద్వారా17 రౌండలలో ఈఓట్ల లెక్కింపును పూర్తి చేస్తామని ఆర్.ఓ వి.విక్టర్ తెలిపారు.అనంతరం ఈవీఎంలలో పోలైన ఓట్ల లెక్కింపును ప్రారంభిస్తామన్నారు.కౌటింగ్‌హాల్‌లో ఏజెంట్లు కూర్చునేందుకుగాను అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.ఈవిఎంలను కట్టుదిట్టమైన భద్రత వలయంలో భద్రపర్చినట్లు వివరించారు. కౌటింగ్‌హాల్‌లోకి అభ్యర్థులు,వారి ఏజెంట్లు,కౌటింగ్ ఏజెంట్లు సిబ్బందికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.ఈ ఓట్ల లెకి ్కంపు ఉదయం 8 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటల లోపు ముగిసేవిధంగా చూస్తామన్నారు. ఎన్నికల పర్యవేక్షులు మలై ముకో ఉపాధ్యాయ సమక్షంలో భద్రపర్చి తాళాలు తెరవనున్నట్లు చెప్పారు.ఎన్నికల లెక్కింపు సిసికెమోరాలను అమర్చినట్లు చెప్పారు.ముందుగా 411 పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు ప్రారంభించడం జరుగుతుందని ఆర్.ఓ వి.విక్టర్ తెలిపారు.నగర పోలీసు కమీషనర్ సందీప్ శాండిల్య కోఠిలోని ఓట్ల లెక్కింపు కౌటింగ్ హాల్‌ను పర్యవేక్షించారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు చేయాలి : పులి కల్పన



ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుకు గోడ పత్రికను అవిష్కరిస్తున్న డిబిఎఫ్ ప్రతినిధులు

అడ్డగుట్ట, డిసెంబర్ 2 ప్రభాతవార్త: దేశ వ్యాప్తంగా ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని, భారత రాజ్యాంగంలో మనుదర్మ శాస్రాన్ని అమలు చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన పిలుపునిచ్చారు. దళిత, బహుజన, ఫ్రంట్ డిబిఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదిన ఢిల్లీలో నిర్వహించ తలపెట్టనున్న కార్యక్రమాన్ని విజయంతం చేయాలని ఏర్పాటు చేసిన గోడపత్రికను శనివారం అడ్డగుట్టలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు రక్షణ కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏకమైయ్యాయన్నారు. భారత రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి మోడీ ప్రభుత్వం నిర్ల క్ష్యం చేస్తుందన్నారు. అదే విధంగా ఎసీ ్స,ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని ఎత్తి వేయాలని కుట్రపన్నుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ ప్రతినిధులు సూర్య, భవానీ తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ప్రాజెక్ట్ బేస్డ్ లెర్న్

జీడిమెట్ల, డిసెంబర్ 2, ప్రభాతవార్త : అపురూపకాలనీలోని టివిఆర్ మోడల్ హై స్కూల్ పిబిఎల్ (ప్రాజెక్ట్ బేస్డ్ లెర్న్) శనివారం అట్టహాసంగా జరిగింది. టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టి.వంశీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెమికల్ టెక్నాలజీ రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ లలితా కుమారి నెల్సన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కాంపిటేషన్‌లో టివిఆర్ మోడల్ స్కూల్, సత్యవాణి విద్యానికేతన్ చింతల్ బచ్పన్, సూరారం బచ్పన్, టివిఆర్ గీతాంజలి, చింతల్ టివిఆర్ హై స్కూల్ ఈ ఆరు స్కూల్స్ నుండి 4వ తరగతి విద్యార్థినీ విద్యార్థులు సందేఖ శాస్త్ర సబ్జెక్టుకు సంబంధించిన విషయపరిజ్ఞానంపే నమూనాలను తయారు చేసి వివరించారు. భారతదేశ ఔన్నత్యం గురించి తెలిపే 15 మంది భారత రాష్ట్రపతుల వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. సోషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా ట్రాన్స్పోర్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఫిజికల్ ఫీచర్స్ ఆఫ్ ఇండియా సూర్యని చుట్టూ ఉన్న గ్రహాల కూటమి భారత దేశపు రాష్ట్రాల ప్రాముఖ్యత వ్యవసాయ పంటలు సారవంత భూమి వివరాలు పాడి పరిశ్రమ ఉత్పత్తులు మొదలగు వాటి గురించి చిన్నారులు అద్భుతంగా వివరించారు. సందర్శించడానికి వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లలు తయారు చేసిన నమూనాలను ఈ పిబిఎల్ విధానం ద్వారా తమ చిన్నారులకు ఉత్తమమైన శిక్షణ ఇస్తున్న టివిఆర్ యజమాన్యానికి కృతజ ్ఞతలు తెలిపారు. పిబిఎల్ నిర్వహించి నిష్ణాదులుగా తీర్చిదిద్దిన అధ్యాపక బృందాన్ని విద్యార్థిని విద్యార్థులను టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టి.కోటిరెడ్డి అకాడమిక్ డైరెక్టర్ సురా రవిచంద్రరెడ్డిలు అభినందించారు.

## సూరారంలో డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠా అరెస్ట్

జీడిమెట్ల, డిసెంబర్ 2, ప్రభాతవార్త : సూరారంలో డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠాను తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో అధికారులు శనివారం అరెస్ట్ చేశారు. సూరారం పోలీసులతో పాటు సంయుక్త ఆపరేషన్ చేసి ముఠా సభ్యులను పట్టుకున్నట్లు యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఎస్పీ గుమ్మి చక్రవర్తి తెలిపారు. ఈ దాడిలో డ్రగ్స్ తయారు చేస్తున్న ముగ్గురు నిందితులు, వారి నుంచి 60 గ్రాముల క్రిస్టల్ మేథాంఫెటమైన్, 700 ఎంఎల్ లిక్విడ్ మెథాంఫెటమైన్ డ్రగ్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ సుమారు రూ. 50లక్షలు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రగ్స్ తయారు చేస్తున్నవారిలో ప్రధాన నిందితుడు కె.శ్రీనివాస్‌గా గుర్తించామన్నారు. అతను ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ నగరంలో గాజులరామారంలో నివాసం ఉంటున్నాడు. నిందితుడు శ్రీనివాస్‌కు డ్రగ్స్ తయారీపై అవగాహన ఉంది. 2013లో ఓ పరిశ్రమలో డ్రగ్స్ తయారు చేయగా, నార్కోటిక్స్ బ్యూరో అధికారులు జైలుకు పంపారు. జైలు నుంచి బయటికి వచ్చాక నరసింహరాజు, మణికంఠతో కలిసి సూరారంలో ఒక ఇంట్లో డ్రగ్స్ తయారు చేయడం మొదలుపెట్టారు. ఈ ముగ్గురూ కలిసి గత రెండేళ్ళుగా డ్రగ్స్ తయారు చేసి వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. లిక్విడ్ మెథాంఫెటమైన్ తీసుకొని ప్రాసెస్ చేసి డ్రై చేస్తే క్రిస్టల్ మెథాంఫెటమైన్ డ్రగ్ తయారవుతుంది.

అలా తయారు చేసిన మాదకద్రవ్యాలను వివిధ ప్రాంతాలలో విక్రయించారు. సోషల్‌మీడియా ద్వారా విక్రయాలు కొనసాగించారని ఎస్పీ వివరించారు. అదుపులోకి తీసుకున్న ముగ్గురు నిందితులపై పీడియాక్ట్ నమోదుకు ప్రతిపాదన చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

## కంప్యూటర్ సైన్ ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చు

### ప్రొఫెసర్ వెంకటదాసు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వెంకటదాస్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 2 ప్రభాతవార్త: కంప్యూటర్ సైన్ ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవడంతో విజయతీరాలకు చేరుకుంటారని ఉస్మానియా విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ వెంకటదాస్ అభిప్రాయపడ్డారు. శనివారం అవంతి పీజీ కళాశాల(దిల్‌సుఖ్‌నగర్) కళాశాల ఆధ్వర్యంలో ఫేర్వెల్ పార్టీ కార్యక్రమం నారాయణగూడలో జరిగింది. అవంతి విద్యాసంస్థ హెచ్ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద అతిథులకు స్వాగతం పలుకగా కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు విద్యాసంస్థ గురించి వివరించారు. గౌరవ అతిథిగా హాజరైన సైబర్‌ట్రీట్ ఇన్వెస్టిగేషన్ హెచ్ఆర్ అనాలిస్ట్ కార్తికేయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఊహాత్మక ఆలోచన పంథాని అలవర్చుకోవాలని అన్నారు. సామాజిక మాధ్యమాలను ఉపయోగించే విషయంలో జాగురకతతో ఉండాలని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు విజ్ఞానాన్ని తన మేధస్సులో ఉన్న 'గూగుల్ డ్రైవ్'లో నిక్షిప్తం చేసుకోవాలని అన్నారు. ప్రత్యేక అతిథిగా హాజరైన ఎం.దుర్గ మాట్లాడుతూ బాల్యంలో గమనించిన గొంగళిపురుగు, సీతాకొకచిలుక మారిన రూపాంతరం గురించి చెప్పి విద్యార్థులు తమ కౌశలంతో సీతాకొకచిలుకలలా ఎగరాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యాసంస్థ తరఫున అతిథులను ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ సరళాదేవి వందన సమర్పణ చేయగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి.

## భారీ పోలీస్ బందోబస్తు

బేగంబజార్,డిసెంబర్ 2 ప్రభాతవార్త: గ్రేటర్‌హైదరాబాద్ మహానగరంలో ఆదివారం జరిగే ఓట్ల లెక్కింపులో భాగంగా గోషామహల్, నాంపల్లి నియోజకవర్గాలలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగుండా నగర పోలీస్ కమీషనర్ సందీప్ శాండిల్య ఆద్వర్యంలో ఐదుజోన్ల డిసిపి పరుధుల్లో భారీపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. గోషామహల్ నియోజకవర్గంలోని కోఠి ఉమెన్స్ కళాశాలలో గోషామహల్ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది.అదేవిధంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ మైదానంలో చార్మినార్,యాకుత్‌పురా నియోజకవర్గాలకు చెందిన ఓట్ల లెక్కింపుకొనసాగుతుంది.లాల్ బహుదూర్ స్టేడియంలో కార్వాన్,నాంపల్లి నియోజకవర్గాలకు చెందిన అసెంబ్లీ ఓట్ల లెక్కింపు కొనసాగుతుంది. ఈ సంద ర్భంగా ఎలాంటి అవాంచనీయసంఘటనలు జరుగకుండా సెంట్రల్‌జోన్, వెస్ట్‌జోన్,ఈస్టుజోన్ డిసిపిలు ఆద్వర్యంలో ఎసిపిలు, ఆయా పోలీస్‌స్టేషన్లకు చెందిన ఇన్‌స్పెక్టర్లు తమ అదనపు పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక పోలీసు బందోబస్తును ఏర్పాటుచేశారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఇలాంటి ఇబ్బందులు కలుగకుండా నిఘా పెట్టేందుకుగాను స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్‌స్ట్రైకింగ్‌ఫోర్స్‌లను రంగంలోకి దింపుతున్నారు.

## తార్నాక గణేష్ టెంపుల్‌లో ప్రత్యేక పూజలు

తార్నాక, డిసెంబర్ 2 ప్రభాతవార్త: తార్నాకలోని ప్రముఖ గణేష్ టెంపుల్‌లో శనివారం శ్రీవైష్ణవి మూవి మేకర్స్ చిత్రం బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిఖిల్ తేజా ఫిలీం వెంకి వర్సెస్ నాగ్ సినిమా నిర్మాతలు మల్లిగారి ప్రవీణ్ కుమార్, గౌడెల్లి కొండల్ రెడ్డి,కో ప్రొడ్యూసర్ మల్లిగారి మహేందర్, డైరెక్టర్ నిఖిల్‌తేజ క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హీరో ఆకాష్ (నర్సింగ్) హీరోయిన్ శివాణిలతో కలిసి చేస్తున్న మొట్టమొదటి సినిమా అన్నారు. కామెడీ, ఫ్యామిలీ ఎంటర్ టైన్ మెంట్ ప్రధాన ఇతి వృత్తంగా ఈ సినిమా చేస్తున్నామని అందరు ఆదరించాలని కోరారు. చిన్న సినిమాలను అందరు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కోడైరెక్టర్ వికాస్, మ్యూజిక్ డైరెక్టర్ సుధా, శ్రీనివాస్, రమేష్, నటుడు అంజిమామతో పాటు బృందం పాల్గొన్నారు.

## బీసీ రాజ్యాధికార సమితి పోలీస్ అధికారుల సంఘం ఉపాధ్యక్షుడిగా రవీందర్‌కుమార్

చిక్కడపల్లి, డిసెంబరు 2 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర బీసీ రాజ్యాధికార సమితి పోలీసు ఎంప్లాయిస్ సంఘం ఉపాధ్యక్షుడిగా రవీందర్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు సమితి అధినేత దాసుసురేశ్ బాగ్‌లింగంపల్లిలోని కేంద్రంలో కార్యాలయంలో నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రవీందర్‌కుమార్ మాట్లాడుతూ బీసీలకు సంబంధించిన న్యాయమైన సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, బీసీలకు దక్కాల్సిన హక్కులను అందే విధంగా తనవంతు కృషి చేస్తానన్నారు.

## లోయర్‌ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మ ఆలయంలో అంజన్‌కుమార్‌యాదవ్ పూజలు



చిక్కడపల్లి, డిసెంబరు 2ప్రభాతవార్త: లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని పవిత్రమైన కనకాల కట్టమైసమ్మ దేవాలయాన్ని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీసులు తీసుకున్నానని, ఆదివారం జరిగే కౌంటింగ్‌లో తనకు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని వేడుకోవడం జరిగిందని, రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకోవడం జరిగిందని అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్, కాంగ్రెస్ నేతలు జానకి సుధాకర్, శశిధర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.